బుధవారం
WEDNESDAY
18-11-2026

సంపుటి (Volume):2 || సంచిక: (Issue): 139

జగిత్యాల
JAGITIAL

పేజీలు: (PAGES):12
వెల (PRICE): 2.00

Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385

www.evarthalu.com

నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక





రాజన్నా.. అపచారం!

గర్భగుడిని ముట్టుకోమని చెప్పి.. శిఖరానికి ఎసరు

అభివృద్ధి ముసుగులో ఆలయ ప్రాచీన వైభవానికి దెబ్బ

స్లాబ్ నిర్మాణంతో శిఖర దర్శనానికి అడ్డంకులు

శృంగేరి పీఠం అనుమతులపై అసలు నిజాలు బయటపెట్టాలి

నిధుల లెక్కలేవి? నిర్మాణ పనుల్లో పారదర్శకత ఏది?

ఆలయంలోకి మీడియా, పార్టీల ప్రతినిధులను అనుమతించాలి

రాజన్న ఆలయం ఎవరి జాగీరు కాదు.. అది భక్తులది

బీజేపీ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి

దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులపై తీవ్ర వివాదం రేగుతోంది. శతాబ్దాల చరిత్ర కలిగిన ఆలయ ప్రాచీన నిర్మాణాలు, ఆగమ సంప్రదాయాల పరిరక్షణపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గర్భగుడిని ముట్టుకోబోమని గతంలో హామీ ఇచ్చిన అధికారులు.. ఇప్పుడు దాని శిఖరాన్ని తొలగించేందుకు ఎందుకు ప్రయత్నిస్తున్నారని బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి నిలదీశారు.

రాజన్న సిరిసిల్ల బ్యూరో/వేములవాడ అర్బన్, నవంబర్ 17 (ఈవార్తలు): ఆలయ అభివృద్ధి పేరుతో భక్తుల మనోభావాలను దెబ్బతీస్తే సహించేది లేదని హెచ్చరించారు. రాజన్న ఆలయం ఎవరి వ్యక్తిగత జాగీరు కాదని, కోట్లాది మంది హిందువుల ఆరాధ్య దైవమని స్పష్టం చేశారు. మంగళవారం వేములవాడలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో గోపి మాట్లాడారు. ఆలయ అభివృద్ధి పనుల తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ప్రభుత్వం, ఆలయ అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. గత ఏడాది కాలంగా రాజన్న ఆలయ అభివృద్ధి పనుల విషయంలో బీజేపీ సంయమనం పాటించిందని గోపి తెలిపారు. అభివృద్ధికి సహకరించాలని అధికార పార్టీ కోరడంతో రాజకీయాలకు అతీతంగా సహకరిస్తూ వచ్చామని చెప్పారు. అయితే అభివృద్ధి పేరుతో ఆలయ ప్రాచీన కట్టడాలకు ముప్పు కలిగించే పరిస్థితులు తలెత్తుతున్నాయని ఆరోపించారు. ఆలయ పవిత్రతను దెబ్బతీసే చర్యలను చూస్తూ ఊరుకునే తరువాయి 2 వ పేజీలో...

కోటి కుటుంబాలకు బీమా



ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ఇందిరమ్మ ఇన్సూరెన్స్

ప్రభుత్వ బీమా పథకాలన్నీ ఒకే గొడుగు కిందకు

19న సిద్దిపేట సభలో ఇందిరమ్మ బీమా దరఖాస్తుల ప్రారంభం

అర్హులైన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీర అందాలి

అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

రాష్ట్రంలోని కోటి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున జీవిత బీమా కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలో ప్రస్తుతం అమలవుతున్న బీమా పథకాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని సూచించారు. నవంబర్ 19న మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా సిద్దిపేటలో నిర్వహించే బహిరంగ సభలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించనున్న నేపథ్యంలో మంగళవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు.

హైదరాబాద్, నవంబర్ 17 (ఈవార్తలు): ఇందిరమ్మ బీమా, ఇందిరమ్మ చీరల పంపిణీకి సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు. రాష్ట్రంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి బీమా భద్రత అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇందిరమ్మ బీమా పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా అందించాలని సీఎం సూచించారు. ఈ పథకంతో ఉపాధి హామీ కూలీల తోపాటు లక్షలాది మంది పేద కుటుంబాలకు ఆర్థిక భద్రత లభిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం వివిధ శాఖల ద్వారా అమలవుతున్న పథకాల్లో జీవిత బీమా కింద రూ.2 లక్షలు, ప్రమాద బీమా కింద రూ.10 లక్షల వరకు అందుతున్నట్లు అధికారులు వివరించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం రూ.2 లక్షల జీవిత బీమా ఉన్న పథకాలను ఇందిరమ్మ బీమా పరిధిలోకి తీసుకొచ్చి కవరేజీని రూ.5 లక్షలకు పెంచాలని సీఎం ఆదేశించారు. అదే సమయంలో ఇప్పటికే అందుతున్న ప్రమాద బీమా ప్రయోజనాలను యథాతథంగా కొనసాగించాలని సూచించారు. ప్రభుత్వ బీమా పథకాల ద్వారా ప్రస్తుతం లబ్ధి పొందుతున్న వారిలో ఒక్కరినీ కూడా తొలగించవద్దని స్పష్టం చేశారు. ఇందిరమ్మ బీమా -2 వ పేజీలో...



ఆత్మకథలో 'తెలంగాణ' ఏది?

సోనియా బయోగ్రఫీలో ప్రస్తావన లేదేం?.. కాంగ్రెస్ నేతలను ప్రశ్నించిన కేటీఆర్

తెలంగాణ.. ప్రజల పోరాట ఫలితమేనని వ్యాఖ్య

హైదరాబాద్, నవంబర్ 17 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్రాన్ని సోనియా గాంధీ ఇచ్చారని చెప్పుకునే కాంగ్రెస్ నాయకులు, ఆమె ఆత్మకథలో రాష్ట్ర ఏర్పాటు ప్రస్తావన ఎందుకు లేదో సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. సోనియా గాంధీ గుండెల్లో తెలంగాణ ఉంటే, ఆమె రాసిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకంలో తెలంగాణ ఏర్పాటు గురించి ఎందుకు రాయలేదని నిలదీశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కాంగ్రెస్ నాయకత్వంపై విమర్శలు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సోనియా గాంధీ దయాభిక్ష కాదని, ప్రజలు సాగించిన సుదీర్ఘ పోరాట ఫలితమని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర సాధన కోసం తెలంగాణ ప్రజలు చేసిన ఉద్యమాన్ని విస్మరించి, ఆ ఘనతను ఒక వ్యక్తికి ఆపాదించడం సరికాదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ తరువాయి 2 వ పేజీలో...

బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

గ్రాము-24 క్యారెట్స్):	రూ.13,604
వెండి (కిలో):	రూ.1,90,000
ప్లాటినం (గ్రాము):	రూ.4,426



శాంతితోనే శ్రేయస్సు


పోటీ కాదు.. సహకారమే భవిష్యత్తుకు బాట

ఆసియాన్ సదస్సులో ప్రధాని మోదీ పిలుపు

ఒకదానికి ఒకటిలా భారత్ – ఆసియాన్

ఉచిత ఈ-వీసాలు సహా 9 కీలక ప్రతిపాదనలు

మనీలా, నవంబర్ 17: ప్రపంచ దేశాల భవిష్యత్తును పోటీ కాకుండా పరస్పర సహకారమే నిర్ణయించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల్లో శాంతి, స్థిరత్వంతోపాటు భవిష్యత్తుపై భరోసా ఎంతో అవసరమని స్పష్టం చేశారు. ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో మంగళవారం జరిగిన 23వ భారత్-ఆసియాన్ సదస్సులో ఆయన ప్రసంగించారు. భారత్ అభివృద్ధి, ఆసియాన్ దేశాల శ్రేయస్సు ఒకదానితో మరొకటి ముడిపడి ఉన్నాయని పేర్కొన్నారు. భారత్, ఆసియాన్ దేశాలు కలిపి ప్రపంచ జనాభాలో తరువాయి 2 వ పేజీలో...



మోదీ చాలా టఫ్

క్వాడ్ సదస్సులో భారత ప్రధానిపై ట్రంప్ ప్రశంసలు

4 దేశాల భాగస్వామ్యంతో ఇండో-పసిఫిక్ భద్రతపై కీలక నిర్ణయాలు

ఏఐ అభివృద్ధికి 8.5 కోట్ల డాలర్లతో ప్రత్యేక కార్యక్రమం

2027లో సంయుక్త సముద్ర గస్తీ విమాన విన్యాసాలు

ముంబైలో క్వాడ్ బిజినెస్ లీడర్స్ ఫోరం నిర్వహణ

మనీలా, నవంబర్ 17: భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మోదీ చాలా గట్టి వ్యక్తి అంటూ ప్రశంసించారు. ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో మంగళవారం జరిగిన క్వాడ్ దేశాల సదస్సు సందర్భంగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దేశాధినేతలు పాల్గొన్న ఈ సమావేశంలో ఇండో-పసిఫిక్ ప్రాంత భద్రత, ఆర్థిక సహకారం, తరువాయి 2 వ పేజీలో...

విశ్వవాణి



దక్షిణాసియా ఫుట్‌బాల్‌లో భారత జట్టు మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలోని నేషనల్ స్టేడియంలో జరిగిన సాఫ్ ఛాంపియన్‌షిప్ 2026 ఫైనల్లో భారత్ 2-1 తేడాతో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై చిరస్మరణీయ విజయం సాధించింది. హోరాహోరీగా సాగిన ఈ తుది సమరంలో అద్భుత ప్రదర్శన కనబరిచిన భారత జట్టు, రికార్డు స్థాయిలో పదోసారి సాఫ్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీని ముద్దాడింది.



స్వీట్లపై అల్యూమినియం రేకు!

హైదరాబాద్‌లో నకిలీ వెండి వర్క్ తయారీ ముఠా గుట్టురట్టు

నాలుగు కేంద్రాలపై పోలీసుల దాడులు.. నలుగురి అరెస్ట్

హైదరాబాద్, నవంబర్ 17 (ఈవార్తలు): స్వీట్లు, పాన్‌లు, బేకరీ ఉత్పత్తులపై అలంకరణ కోసం ఉపయోగించే వెండి రేకుల స్థానంలో అల్యూమినియం రేకులను తయారు చేసి విక్రయిస్తున్న ముఠాను హైదరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. చార్మినార్, ఫలక్‌నుమా ప్రాంతాల్లోని నాలుగు అక్రమ తయారీ కేంద్రాలపై టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఆహార భద్రతా నిబంధనలను ఉల్లంఘించి నకిలీ వెండి వర్క్ తయారు చేస్తున్న నలుగురిని అరెస్ట్ చేసి, నాలుగు కేసులు నమోదు చేశారు. ఈ వివరాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ మహేశ్ భగవత్ మీడియాకు వెల్లడించారు. పోలీసుల తనిఖీల్లో

కాస్ట్‌లీ బాటిళ్లలో చీప్ లిక్కర్

హైదరాబాద్‌లో నకిలీ మద్యం దందా గుట్టురట్టు

ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ దాడుల్లో ఇద్దరి అరెస్ట్.. 40 మద్యం సీసాలు స్వాధీనం



హైదరాబాద్, నవంబర్ 17 (ఈవార్తలు): ఖరీదైన బ్రాండ్ల మద్యం బాటిళ్లలో చౌక మద్యం నింపి వినియోగదారులను మోసం చేస్తున్న దందాను ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు బయటపెట్టారు. శంషాబాద్ పరిధిలోని శాతరాయిలో ఓ ఇంటిపై దాడి చేసి నకిలీ మద్యం తయారు చేస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు. అతడికి ఖాళీ బాటిళ్లు సరఫరా చేస్తున్న స్క్రాప్ వ్యాపారిని కూడా అరెస్ట్ చేశారు. దాడుల్లో నకిలీ మద్యంతో నింపిన 10 సీసాలు, ఖరీదైన బ్రాండ్లకు చెందిన 30 ఖాళీ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అధికారుల వివరాల ప్రకారం.. శాతరాయికి చెందిన అశోక్ గతంలో బగ్గా డిస్టిలరీలో పనిచేశాడు. అనంతరం క్యాబ్ డ్రైవర్‌గా తరువాయి 2 వ పేజీలో...



రష్యాలో ఘోర విమాన ప్రమాదం..

19 మంది మృతి

గాల్లోనే మంటలు..

నేలకూలిన సైనిక రవాణా విమానం

ప్రమాదంలో విమానంలోని వారంతా మృతి

సాంకేతిక లోపమే కారణమన్న రష్యా రక్షణ శాఖ

మాస్కో, నవంబర్ 17: రష్యాలో ఘోర విమాన ప్రమాదం జరిగింది. సైబీరియాలోని కెమెరోవో ప్రాంతంలో మంగళవారం ఏఎన్-12 సైనిక రవాణా విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో విమానంలోని 19 మంది ప్రాణాలు కోల్పోయినట్లు రష్యా రక్షణ శాఖ ధ్రువీకరించింది. తొలుత 17 మంది మరణించినట్లు వార్తలు వచ్చినప్పటికీ, మృతుల సంఖ్యను అధికారులు 19గా నిర్ధారించారు. కెమెరోవో సమీపంలోని తరువాయి 2 వ పేజీలో...

రాశి ఫలాలు

18.11.2026

మేషం: వృత్తి ఉద్యోగాలలో మరింత పురోగతి కలుగుతుంది. నూతన విషయాలు తెలుసుకుంటారు. ఆర్థికంగా అనుకూల వాతావరణం ఉంటుంది. ఇంటా బయట మీ శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది. వ్యాపారాలలో ఆశించిన రీతిలో లాభాలు అందుకుంటారు.

వృషభం: శుభకార్యాలు నిర్వహిస్తారు. చేపట్టిన పనులు విజయవంతంగా పూర్తవుతాయి. వృత్తి వ్యాపారాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. స్థిరాస్తి వృద్ధి చెందుతుంది. ప్రముఖుల నుండి ఊహించని ఆహ్వానాలు అందుతాయి.

మిథునం: వృత్తి వ్యాపారాలు చికాకుగా ఉంటాయి. చేపట్టిన పనులలో అవాంతరాలు కలుగుతాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో ఆసక్తి పెరుగుతుంది. ఆదాయానికి మించిన ఖర్చులు పెరుగుతాయి. బంధువులతో అకారణంగా మాటపట్టింపులు కలుగుతాయి.

కర్కాటకం: ఆరోగ్య విషయాల్లో శ్రద్ధ వహించాలి. ఆర్థిక పరిస్థితి స్థిరంగా ఉండదు. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో సమస్యలు ఉంటాయి. దూర ప్రయాణాలు చేయవలసి రావచ్చు. నూతన వ్యాపార ప్రారంభానికి అవరోధాలు ఏర్పడతాయి.

సింహం: వ్యాపారాలు సంతృప్తి కలిగిస్తాయి. సంతానానికి నూతన విద్యావకాశాలు లభిస్తాయి. ఉద్యోగస్తులకు పని ఒత్తిడి తొలగుతుంది. చిన్ననాటి మిత్రుల సహాయంతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు.

కన్య: నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. కుటుంబ సభ్యులతో ఆలయ దర్శనాలు చేసుకుంటారు. ఉద్యోగాలలో ఇతరులతో సమస్యలు కలుగుతాయి. చేపట్టిన పనులలో అవాంతరాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి.

తుల: ఉద్యోగస్తులు ఉన్నత అవకాశాలు పొందుతారు. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. స్థిరాస్తి క్రయ విక్రయాలలో లాభాలు అందుకుంటారు. చేపట్టిన వ్యవహారాలలో ఆకస్మిక విజయం లభిస్తుంది. కొన్ని పనులలో ఆప్తుల సలహాలు తీసుకోవడం మంచిది.

వృశ్చికం: సమయానికి నిద్రాహారాలు ఉండవు. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. వృత్తి వ్యాపారాలలో ఆర్థిక నష్టాలు కలుగుతాయి. ఉద్యోగస్తుల పనికి తగిన గుర్తింపు లభించక విమర్శలు ఎదురవుతాయి. చేపట్టిన పనులు సమయానికి పూర్తి కాక చికాకులు పెరుగుతాయి.

ధనస్సు: బంధు మిత్రుల ఆదరణ కలుగుతుంది. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. వృత్తి వ్యాపారాలలో మరింత ఉత్సాహంగా పని చేసి లాభాలు అనుకుంటారు. ఆర్థికంగా ఒడిదుడుకులు తొలగి స్థిరత్వం కలుగుతుంది. గృహమున వివాహాది శుభకార్య ప్రయత్నాలు చేస్తారు.

మకరం: ప్రయాణాలలో నూతన పరిచయాలు భవిష్యత్తులో ఉపయోగపడే విధంగా ఉంటాయి. ఊహించిన విధంగా పనులు పూర్తి చేస్తారు. వ్యాపార ఉద్యోగాలలో సమస్యలను అధిగమించి ధైర్యంగా ముందుకు సాగుతారు. సోదరులతో స్థిరాస్తి వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి.

కుంభం: చేపట్టిన పనులు అనుకున్న సమయానికి పూర్తికాక శ్రమాధిక్యత కలుగుతుంది. బంధువులు మీ మాటతో విభేదిస్తారు ఆలోచనలలో స్థిరత్వం ఉండదు. ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు పెరుగుతాయి. వ్యాపారాలలో భాగస్తులు తో చిన్నపాటి సమస్యలు కలుగుతాయి.

మీనం: నూతన వ్యాపారాలు ఒడిదుడుకులుగా ఉంటాయి. దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. వృత్తి ఉద్యోగాలలో కొందరి ప్రవర్తన బాధ కలిగిస్తుంది. కుటుంబ సభ్యులతో విభేదాలు కలుగుతాయి. చేపట్టిన పనులు మరింత మందకొడిగా సాగుతాయి.

శాంతితోనే శ్రేయస్సు



మొదటి పేజీ తరువాయి

దాదాపు నాలుగో వంతు ఉన్నాయని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో పోటీ కంటే సహకారానికి ప్రాధాన్యం ఇస్తే ఇండో-పసిఫిక్ ప్రాంతాన్ని శాంతి, స్థిరత్వానికి కేంద్రంగా మార్చవచ్చని అభిప్రాయపడ్డారు. గత కొన్నేళ్లుగా ప్రపంచం వరుస సంక్షోభాలను ఎదుర్కొంటోందని మోదీ అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో 'మన భవిష్యత్తును కలిసికట్టుగా ముందుకు నడిపిద్దాం' అనే ఈ ఏడాది సదస్సు థీమ్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఉందన్నారు. భారత్ అనుసరిస్తున్న 'యాక్ట్ ఈస్ట్' విధానంతో ఆసియాన్ దేశాలతో సంబంధాలు మరింత బలపడ్డాయని వివరించారు. గతంలో సాంస్కృతిక సంబంధాలకే ఎక్కువగా పరిమితమైన భాగస్వామ్యం ప్రస్తుతం డిజిటల్ టెక్నాలజీ, రక్షణ, అంతరిక్ష రంగాలకు విస్తరించిందని తెలిపారు. 2014 నుంచి ప్రజల మధ్య సంబంధాలను బలోపేతం చేసేందుకు 100కు పైగా కార్యక్రమాలు చేపట్టామని, దాదాపు 250 క్విక్ ఇంపాక్ట్ ప్రాజెక్టులు ప్రారంభించామని చెప్పారు. నైపుణ్యాభివృద్ధి కోసం 10 వేలకుపైగా స్కాలర్‌షిప్‌లు అందించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం భారత్ నుంచి తొమ్మిది ఆసియాన్ దేశాలకు నేరుగా విమాన సర్వీసులు ఉన్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో 'వికసిత భారత్-2047', 'ఆసియాన్ కమ్యూనిటీ విజన్-2045' లక్ష్యాలు ఇరుపక్షాల ఉమ్మడి ఆకాంక్షలను నెరవేర్చడంలో కీలక పాత్ర పోషిస్తాయని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడానికే పరిమితం కాకుండా కొత్త టెక్నాలజీని సంయుక్తంగా అభివృద్ధి చేయాలని సూచించారు. 2027లో భారత్-ఆసియాన్ సంబంధాలకు 35 ఏళ్లు, సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఐదేళ్లు పూర్తవుతాయని గుర్తుచేశారు. ఆసియాన్ దేశాలతో సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు మోదీ తొమ్మిది కీలక ప్రతిపాదనలు చేశారు. సముద్ర భద్రత, రవాణా అనుసంధానం, శాస్త్రీయ పరిశోధనలు, విపత్తుల నిర్వహణకు సంబంధించిన దీర్ఘకాలిక సహకార ప్రణాళికను ప్రతిపాదించారు. సైబర్ ఫోరెన్సిక్స్‌లో సంయుక్త శిక్షణ, అణుశక్తి రంగంలో సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, అంతరిక్ష రంగంలో హ్యాకథాన్ నిర్వహణ, కీలక ఖనిజాల రంగంలో సహకారం పెంపుపై దృష్టి సారించారు. యువజన సదస్సులు, యువ పార్లమెంటేరియన్ల పరస్పర పర్యటనలు, స్టార్టప్ హ్యాకథాన్‌ల ద్వారా యువతకు అవకాశాలు కల్పించాలని సూచించారు. నలంద విశ్వవిద్యాలయంలో ఆసియాన్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పెంచడం, వేవ్స్-2027లో ప్రత్యేక భాగస్వామ్య వేదిక ఏర్పాటు చేయడంతోపాటు ఆసియాన్ దేశాల పర్యాటకులకు ఉచిత ఈ-వీసాలు అందించాలని ప్రతిపాదించారు. ఈ సందర్భంగా విపత్తుల నిర్వహణలో పరస్పర సహకారానికి సంబంధించిన సంయుక్త ప్రకటనను భారత్, ఆసియాన్ దేశాల నేతలు ఆమోదించారు. సదస్సు సందర్భంగా ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్‌తో మోదీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రక్షణ, భద్రత, అంతరిక్షం, రైల్వే మౌలిక సదుపాయాలు, ఫిన్‌టెక్, వాణిజ్యం, పెట్టుబడుల రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పెంచుకోవడంపై చర్చించారు. అనంతరం జరిగిన 21వ తూర్పు ఆసియా సదస్సులోనూ మోదీ ప్రసంగించారు. ఉక్రెయిన్, పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఘర్షణలకు శాంతియుత పరిష్కారం కనుగొనే ప్రయత్నాలకు భారత్ మద్దతిస్తుందని స్పష్టం చేశారు. సముద్ర మార్గాల్లో వాణిజ్య నౌకలు, నావికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. సైబర్ నేరాల నియంత్రణ కోసం భారత్‌లో అంతర్జాతీయ సదస్సు నిర్వహించాలని ప్రతిపాదించారు.

మోదీ చాలా టఫ్

మొదటి పేజీ తరువాయి

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అరుదైన ఖనిజాల సరఫరా వంటి అంశాలపై కీలక చర్చలు జరిగాయి. రెండేళ్ల తర్వాత జరిగిన క్వాడ్ దేశాధినేతల ప్రత్యక్ష సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ.. మోదీ గొప్ప నాయకుడని, ప్రపంచవ్యాప్తంగా ఆయనకు గౌరవం ఉందని పేర్కొన్నారు. తమ మధ్య స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని గుర్తుచేశారు. మోదీ చాలా టఫ్ మ్యాన్ అని వ్యాఖ్యానించిన ట్రంప్, జపాన్ ప్రధాని సనాయే తకైచి మరింత గట్టివారై ఉండొచ్చంటూ సరదాగా మాట్లాడారు. క్వాడ్ దేశాల నాయకులంతా తనకు మంచి మిత్రులని చెప్పారు. క్వాడ్ భాగస్వామ్యం ప్రపంచంలోనే అత్యంత కీలకమైన కూటముల్లో ఒకటిగా ఎదిగిందని ట్రంప్ పేర్కొన్నారు. 2017లో మనీలా వేదికగానే క్వాడ్ సహకారానికి కొత్త ఊపు వచ్చిందని గుర్తుచేశారు. నాలుగు దేశాల మధ్య సంబంధాలు మరింత బలపడ్డాయని, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, ఆర్థిక అభివృద్ధికి ఈ భాగస్వామ్యం కీలకమని అభిప్రాయపడ్డారు. భారత్, జపాన్, ఆస్ట్రేలియా నాయకులకు అవసరమైనప్పుడు తనతో నేరుగా మాట్లాడే అవకాశం ఎప్పుడూ ఉంటుందని చెప్పారు. భవిష్యత్ టెక్నాలజీ అభివృద్ధిలో నాలుగు దేశాలు కలిసి పనిచేయాలని సదస్సులో నిర్ణయించారు. ఇందుకోసం ప్రత్యేక క్వాడ్ ఏఐ యాక్సిలరేటర్ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లనున్నట్లు ప్రకటించారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో విశ్వసనీయ ఏఐ టెక్నాలజీ అందుబాటును విస్తరించేందుకు 85 మిలియన్ డాలర్లకుపైగా ఖర్చు చేస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. సముద్ర భద్రత విషయంలోనూ సహకారాన్ని పెంచాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా 2027లో నాలుగు దేశాలకు చెందిన పీ-8, పీ-3సీ గస్తీ విమానాలతో సంయుక్త సముద్ర నిఘా విన్యాసాలు నిర్వహించనున్నారు. సైబర్ భద్రత, సముద్ర మార్గాల్లో స్వేచ్ఛాయుత రవాణా, విపత్తుల సమయంలో సహాయక చర్యలపైనా పరస్పర సహకారాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించారు. అరుదైన ఖనిజాల ఉత్పత్తి, సరఫరాలో ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని ట్రంప్ పేర్కొన్నారు. ఈ రంగంలో భారత్, జపాన్, అమెరికా ఇప్పటికే గణనీయమైన పురోగతి సాధిస్తున్నాయని చెప్పారు. రాబోయే పది నెలల్లో తమకు అవసరమైన కీలక వనరులు సమకూరుతాయని ధీమా వ్యక్తం చేశారు. ఖనిజాల సరఫరా వ్యవస్థను బలోపేతం చేసేందుకు కొత్త ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. మరోవైపు 2027 ప్రారంభంలో ముంబైలో తొలి క్వాడ్ బిజినెస్ లీడర్స్ ఫోరం నిర్వహించాలని నిర్ణయించారు. నాలుగు దేశాల వ్యాపారవేత్తలు, ప్రభుత్వ ప్రతినిధులు, నిపుణులను ఒకే వేదికపైకి తీసుకురావడం దీని లక్ష్యం.

క్వాడ్ సదస్సు సందర్భంగా చైనా పర్యటన, ఇతర అంతర్జాతీయ అంశాలపైనా ట్రంప్ స్పందించారు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో చర్చలతోపాటు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సమావేశమయ్యే అవకాశాన్ని ప్రస్తావించారు. ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌తో భేటీ అవకాశాన్ని కూడా తోసిపుచ్చలేదు. మరోవైపు అమెరికాకు చెందిన ప్రముఖ చిప్ తయారీ సంస్థ ఎన్విడియా జాతీయ భద్రత, ఎగుమతుల నియంత్రణ పర్యవేక్షణ కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయడాన్ని స్వాగతించారు. ఇటీవల కంపెనీ సీఈవో పదవికి రాజీనామా చేసిన జెన్సన్ హువాంగ్ తిరిగి బాధ్యతలు చేపట్టినా తనకు అభ్యంతరం లేదని వ్యాఖ్యానించారు.

రాజన్నా.. అపచారం!

మొదటి పేజీ తరువాయి

ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభించినప్పుడు గర్భగుడి నిర్మాణాన్ని ఏమాత్రం ముట్టుకోబోమని అధికారులు చెప్పారని గోపి గుర్తుచేశారు. అలాంటప్పుడు ఇప్పుడు గర్భగుడి శిఖరాన్ని తొలగించే ప్రయత్నాలు ఎందుకు జరుగుతున్నాయని ప్రశ్నించారు. తాజాగా తమ దృష్టికి వచ్చిన ఫొటోల్లో శిఖరాన్ని తొలగిస్తున్నట్లు కనిపిస్తోందని, ఈ పరిణామం భక్తుల్లో ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. అసలు శిఖరాన్ని తొలగించాల్సిన అవసరం ఏమొచ్చింది? ఈ నిర్ణయం ఎవరు తీసుకున్నారు? ఎవరి అనుమతితో పనులు చేస్తున్నారు? ఆగమ సంప్రదాయాలను పరిగణనలోకి తీసుకున్నారా? అంటూ అధికారులను నిలదీశారు. గర్భగుడిని ముట్టుకోమని హామీ ఇచ్చినవారే శిఖరాన్ని తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలపై ప్రభుత్వం వెంటనే వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నిర్మాణ లోపాలను కప్పిపుచ్చేందుకేనా?

ఆలయంలో చేపట్టిన స్లాబ్ నిర్మాణం కారణంగా భక్తులకు గోపుర శిఖర దర్శనం లేకుండా పోయిందని గోపి ఆరోపించారు. ముందస్తు ప్రణాళిక లేకుండా పనులు చేపట్టారా? నిర్మాణంలో లోపాలు జరిగాయా? కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా? అధికారుల పర్యవేక్షణ లోపమా? అనే అంశాలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నిర్మాణంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దకుండా వాటిని కప్పిపుచ్చుకునేందుకు శృంగేరి పీఠాధిపతుల పేరును ప్రస్తావిస్తున్నారని విమర్శించారు. శృంగేరి పీఠం నుంచి అనుమతి తీసుకున్నామని చెబుతున్న అధికారులు ఆ అనుమతులకు సంబంధించిన పత్రాలను ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు. ఏయే నిర్మాణాలకు అనుమతి ఇచ్చారు? గర్భగుడి శిఖరాన్ని తొలగించేందుకు కూడా అనుమతి ఉందా? ఉంటే లిఖితపూర్వక ఆధారాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో వాస్తవాలు తెలుసుకునేందుకు బీజేపీ ప్రతినిధుల బృందం స్వయంగా శృంగేరి వెళ్లి పీఠాధిపతులను కలుస్తుందని వెల్లడించారు. ఇక్కడ జరిగే తప్పిదాలకు శృంగేరి పీఠాన్ని బాధ్యులను చేసే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. రాజన్న ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇప్పటివరకు ఎన్ని కోట్ల రూపాయలు మంజూరు చేసింది? అందులో ఎంత ఖర్చు చేశారు? ఏ పనికి ఎంత కేటాయించారు? కాంట్రాక్టర్ ఎవరు? పనుల పర్యవేక్షణ బాధ్యత ఎవరిది? అనే వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని గోపి డిమాండ్ చేశారు. ఆలయంలోని దక్షిణామూర్తి విగ్రహం, వెయ్యి స్తంభాల మండపం సహా ప్రాచీన నిర్మాణాల ప్రస్తుత పరిస్థితిని వెల్లడించాలని కోరారు. వాటి పరిరక్షణకు తీసుకున్న చర్యలేమిటో చెప్పాలన్నారు. పనులు ఎప్పటికి పూర్తవుతాయి? భక్తులకు పూర్తిస్థాయిలో దర్శనం ఎప్పటి నుంచి కల్పిస్తారు? అప్పటివరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలన్నారు. ఆలయ అభివృద్ధి పేరుతో కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నప్పుడు ప్రతి రూపాయికి లెక్క చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

ఆలయంలోకి మీడియాను ఎందుకు అనుమతించరు?

రాజన్న ఆలయంలో జరుగుతున్న పనులను పరిశీలించే అవకాశం మీడియా ప్రతినిధులకు, అన్ని రాజకీయ పార్టీల నాయకులకు కల్పించాలని గోపి డిమాండ్ చేశారు. ఆలయ అభివృద్ధి ప్రాధికార సంస్థ (వీటీడీడీఏ) వైస్ చైర్మన్, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి అందుకు ఏర్పాట్లు చేయాలని కోరారు. గర్భగుడి శిఖరం, దక్షిణామూర్తి విగ్రహం, వెయ్యి స్తంభాల మండపం సహా ప్రాచీన కట్టడాల పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించేందుకు అనుమతించాలన్నారు. ఆలయంలో అసలు ఏం జరుగుతోంది? ఇప్పటివరకు ఎలాంటి మార్పులు చేశారు? నిర్మాణాలకు ఏమైనా నష్టం జరిగిందా? అనే విషయాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పనులన్నీ నిబంధనల ప్రకారమే జరుగుతుంటే మీడియాను, రాజకీయ పార్టీల ప్రతినిధులను అనుమతించడానికి అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. ఆలయ పరిరక్షణ కోసం శాంతియుతంగా నిరసన తెలిపేందుకు ప్రయత్నించిన బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడాన్ని గోపి తప్పుబట్టారు. రాజన్న ఆలయాన్ని కాపాడాలని కోరడం నేరమా? భక్తుల మనోభావాల గురించి ప్రశ్నించడం తప్పా? అభివృద్ధి పనులను పరిశీలించాలని అడిగితే అరెస్టులు చేస్తారా? అని నిలదీశారు. అరెస్టులు, నిర్బంధాలతో తమ పోరాటాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. ఆలయంలోకి మీడియా, రాజకీయ పార్టీల ప్రతినిధులను అనుమతించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

కోటి కుటుంబాలకు బీమా

మొదటి పేజీ తరువాయి

పథకంపై గ్రామస్థాయి నుంచి విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సీఎం ఆదేశించారు. దరఖాస్తులు గ్రామాల్లోనే అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అర్హులకు పథకంపై పూర్తి అవగాహన కల్పించే బాధ్యతను జిల్లా కలెక్టర్లు తీసుకోవాలన్నారు. దరఖాస్తుల స్వీకరణ నుంచి లబ్ధిదారుల గుర్తింపు వరకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మరోవైపు సిద్దిపేట సభ వేదికగానే ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని అర్హులైన ప్రతి మహిళకు చీర అందేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. చీరలను వెంటనే అన్ని జిల్లాలకు తరలించి పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఇందిరమ్మ బీమా, చీరల పంపిణీపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. చీరల పంపిణీలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమీక్షలో సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, కార్యదర్శి మానిక్ రాజ్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్లానింగ్ శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘోర విమాన ప్రమాదం.. 19 మంది మృతి

మొదటి పేజీ తరువాయి

యాగునోవో గ్రామం వద్ద జనావాసాలు లేని ప్రాంతంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. విమానం గాల్లో ఉండగానే మంటలు చెలరేగినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. మంటల్లో చిక్కుకున్న విమానం వేగంగా నేలకూలుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. విమాన సిబ్బందితో కలిపి మొత్తం 19 మంది ప్రయాణిస్తున్నారని, వారంతా ప్రమాదంలో మరణించారని రష్యా రక్షణ శాఖ వెల్లడించింది. సాధారణ సైనిక విమాన ప్రయాణంలో భాగంగా వెళ్తుండగా ఈ ఘటన జరిగినట్లు తెలిపింది. ప్రాథమిక సమాచారం ప్రకారం సాంకేతిక లోపమే ప్రమాదానికి కారణమని పేర్కొంది. అయితే అసలు కారణాలను నిర్ధారించేందుకు రష్యా వైమానిక దళానికి చెందిన ప్రత్యేక కమిషన్ దర్యాప్తు చేపట్టింది. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకున్నాయి. విమాన శకలాలు పడిన ప్రాంతాన్ని భద్రతా సిబ్బంది తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఘటనాస్థలంలో చెలరేగిన మంటలను అగ్నిమాపక సిబ్బంది అదుపులోకి తీసుకొచ్చారు. కెమెరోవో ప్రాంత గవర్నర్ ఇల్యా సెరెడ్యుక్ స్వయంగా ప్రమాదస్థలికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఆత్మకథలో 'తెలంగాణ' ఏది?

మొదటి పేజీ తరువాయి

సందర్భంగా తెలంగాణ ఉద్యమ కాలం నాటి జ్ఞాపకాలను కేటీఆర్ గుర్తు చేసుకున్నారు. 2011 నవంబర్ 16 నుంచి 21 వరకు తాను చేపట్టిన పాదయాత్రకు 15 ఏళ్లు పూర్తయినట్లు తెలిపారు. ఉద్యమ నాయకుడు కేసీఆర్ పిలుపు మేరకు ఆరు రోజుల పాటు నిర్వహించిన ఆ పాదయాత్ర తనకు ప్రత్యేకమైన జ్ఞాపకమని పేర్కొన్నారు. ఉద్యమ చరిత్రను గుర్తు చేస్తూ సోనియా గాంధీ ఆత్మకథపై కాంగ్రెస్ నేతలను ప్రశ్నించారు.

స్వీట్లపై అల్యూమినియం రేకు!

మొదటి పేజీ తరువాయి

49 బండిళ్ల నకిలీ వెండి రేకులు, 10 కిలోల అల్యూమినియం ఫ్లేక్స్, కేకుల అలంకరణకు ఉపయోగించే కిలో నకిలీ సిల్వర్ కోటెడ్ షుగర్ బాల్స్ స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు కివామ్, పొగాకు, టాల్కమ్ పౌడర్, ఫ్లేవర్డ్ పాన్ చట్నీ, గ్లూకోజ్, మొక్కజొన్న పిండి, జంతు చర్మపు రేకులు, మిక్సర్లు, ప్యాకింగ్ మెషీన్లు, తూకం యంత్రాలను సీజ్ చేశారు. నిందితులు ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతులు లేకుండానే ఈ దందా కొనసాగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఉత్తరప్రదేశ్ నుంచి అల్యూమినియం ఫ్లేక్స్ తెప్పించి వాటిని వెండి రేకుల మాదిరిగా తయారు చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ రేకులను కాజు కట్లీ, కాజు రోల్స్, చమ్‌చమ్ వంటి స్వీట్లతో పాటు మీఠా పాన్‌లలో ఉపయోగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అల్యూమినియం పూత పూసిన షుగర్ బాల్స్‌ను కేకుల తయారీ కోసం బేకరీలకు సరఫరా చేస్తున్నారని పేర్కొన్నారు. జర్దా, కిమామ్ వంటి పాన్ పదార్థాల్లోనూ అల్యూమినియం పొడిని కలుపుతున్నట్లు గుర్తించారు. తెలంగాణవ్యాప్తంగా చిన్న దుకాణాలతో పాటు కొన్ని ప్రముఖ స్వీట్ షాపులకూ ఈ నకిలీ రేకులను సరఫరా చేస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ముఖ్యంగా పండుగల సమయంలో వీటి విక్రయాలు ఎక్కువగా జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. ఆహారంలో ఉపయోగించేందుకు అనుమతి లేని అల్యూమినియం రేకులను తీసుకోవడం ఆరోగ్యానికి హానికరమని పోలీసులు హెచ్చరించారు. అల్యూమినియం అధిక మోతాదులో శరీరంలోకి చేరడం వల్ల మూత్రపిండాలు, నాడీ వ్యవస్థ, ఎముకల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదముందని పేర్కొన్నారు. నిందితులపై భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్లు 318(4), 110తో పాటు ఆహార భద్రతా చట్టంలోని నిబంధనల కింద కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. నకిలీ వెండి రేకులను గుర్తించేందుకు కొన్ని ప్రాథమిక పద్ధతులను పోలీసులు వివరించారు. అసలైన వెండి రేకును చేతితో రుద్దితే సూక్ష్మమైన పొడిగా మారుతుందని, అల్యూమినియం రేకు అయితే నలిగి చిన్న ఉండలుగా మారుతుందని తెలిపారు. అయితే ఇలాంటి పరీక్షలతోనే రేకు స్వచ్ఛతను నిర్ధారించలేమని, కచ్చితమైన నిర్ధారణకు ల్యాబ్ పరీక్షలు అవసరమని పేర్కొన్నారు. రసాయన పరీక్షలను నిపుణులు మాత్రమే నిర్వహించాలని సూచించారు.

కాస్ట్‌లీ బాటిళ్లలో చీప్ లిక్కర్

మొదటి పేజీ తరువాయి

జీవనం సాగిస్తున్నాడు. మద్యం తయారీ, ప్యాకింగ్‌పై ఉన్న అవగాహనను ఉపయోగించుకుని అక్రమంగా డబ్బు సంపాదించాలని భావించాడు. ఇందుకోసం తన ఇంట్లోనే నకిలీ మద్యం తయారీ దందా ప్రారంభించాడు. స్థానికంగా స్క్రాప్ దుకాణం నిర్వహిస్తున్న యాకూబ్ పాషా నుంచి ఖరీదైన మద్యం బ్రాండ్లకు చెందిన ఖాళీ బాటిళ్లను సేకరించేవాడు. వాటిని శుభ్రం చేసి, సుమారు రూ.560 విలువైన 'డౌన్ టెన్' చౌక మద్యాన్ని నింపేవాడు. అనంతరం ఖరీదైన ఒరిజినల్ మద్యంగా నమ్మించి వినియోగదారులకు విక్రయించేవాడని అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంపై ఎక్సైజ్ కానిస్టేబుల్ ధనుంజయ్ జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అధికారులు అశోక్ ఇంటిపై ఆకస్మికంగా దాడి చేశారు. ఆ సమయంలో ఖాళీ బాటిళ్లలో చౌక మద్యం నింపుతున్న అశోక్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అక్కడి నుంచి మద్యంతో నింపిన 10 సీసాలు, మరో 30 ఖాళీ ప్రీమియం బాటిళ్లను సీజ్ చేశారు. అశోక్‌కు ఖాళీ బాటిళ్లు సరఫరా చేస్తున్న యాకూబ్ పాషాను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నకిలీ మద్యాన్ని ఇప్పటివరకు ఎవరెవరికి విక్రయించారు? ఈ దందాలో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉంది? అనే కోణాల్లో ఎక్సైజ్ అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

మళ్లీ భూముల మెగా వేలం

25, 27 తేదీల్లో హెచ్ఎండీఏ ఈ-వేలం

హుడా హైట్స్, నియోపొలిస్, మూసాపేట్‌లో స్థలాల విక్రయం

హైదరాబాద్, నవంబర్ 17 (ఈవార్తలు): హైదరాబాద్ మహానగర పరిధిలోని కీలక ప్రాంతాల్లో ఉన్న స్థలాలను విక్రయించేందుకు హెచ్ఎండీఏ సిద్ధమైంది. నవంబర్ 25, 27 తేదీల్లో హుడా హైట్స్, నియోపొలిస్, మూసాపేట్ ప్రాంతాల్లోని స్థలాలకు ఈ-వేలం నిర్వహించనుంది. ఇందుకు సంబంధించిన ప్రీ-బిడ్ సమావేశం రాయదుర్గంలోని టీ-హబ్‌లో జరిగింది. ఈ సమావేశంలో హెచ్ఎండీఏ ఉన్నతాధికారులు, వేలం నిర్వహణ సంస్థ ఎంఎస్‌టీసీ, ప్రాజెక్ట్ కన్సల్టెన్సీ సంస్థ కేపీఎంజీ ప్రతినిధులు పాల్గొన్నారు. వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి చూపుతున్న డెవలపర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బిడ్డర్లకు స్థలాల వివరాలు, నిబంధనలను వివరించారు. హుడా హైట్స్, నియోపొలిస్, మూసాపేట్ ప్రాంతాల్లోని స్థలాల భౌగోళిక పరిస్థితులు, రవాణా సౌకర్యాలు, మౌలిక వసతులు, భవిష్యత్ అభివృద్ధి అవకాశాలపై కేపీఎంజీ ప్రతినిధులు ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆన్‌లైన్ వేలంలో రిజిస్ట్రేషన్, బిడ్ల దాఖలు విధానాన్ని ఎంఎస్‌టీసీ అధికారులు వివరించారు. భూముల విస్తీర్ణం, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు, ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఈఎండీ), ప్రాజెక్టుల నిబంధనలపై బిడ్డర్లు అడిగిన ప్రశ్నలకు



సమాధానాలిచ్చారు. ఈ-వేలాన్ని పారదర్శకంగా నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. వేలం షెడ్యూల్ ప్రకారం నవంబర్ 25న హుడా హైట్స్‌లోని ఎనిమిది ప్లాట్లకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బిడ్డింగ్ నిర్వహిస్తారు. నవంబర్ 27న నియోపొలిస్‌లోని 4.59 ఎకరాల స్థలానికి ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మూసాపేట్‌లోని 3.15 ఎకరాల స్థలానికి మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆన్‌లైన్ వేలం జరగనుంది.

అభయహస్తం కాదు.. శూన్యహస్తం

కాంగ్రెస్ మేనిఫెస్టోకు మూడేళ్లు

హామీల అమలుపై హరీశ్‌రావు విమర్శలు



హైదరాబాద్, నవంబర్ 17 (ఈవార్తలు): కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో విడుదలై మూడేళ్లు పూర్తయినా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు విమర్శించారు. ప్రజలకు అండగా ఉంటామని చెప్పిన 'అభయహస్తం' కాస్తా 'మొండిహస్తం', 'శూన్యహస్తం'గా మారిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను మోసాల చిట్టాగా మార్చేశారని ఆరోపిస్తూ మంగళవారం ఎక్స్ వేదికగా ప్రభుత్వంపై విమర్శలు చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్ వంటి పవిత్ర గ్రంథాలతో సమానంగా భావించి ప్రతి హామీని అమలు చేస్తామని రేవంత్‌రెడ్డి ప్రమాణం చేశారని గుర్తుచేశారు. మూడేళ్లు గడిచినా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోవడంపై రేవంత్‌రెడ్డి, ఖర్గే, శ్రీధర్‌బాబు, భట్టి విక్రమార్క సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తొలి మంత్రివర్గ సమావేశంలోనే ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్, ఇప్పటివరకు 38 క్యాబినెట్ సమావేశాలు నిర్వహించినా ఆ పని ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలతో పాటు 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ పాలన తీరును ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో గుణపాఠం చెబుతారని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు.



జీహెచ్ఎంసీ పార్కుల్లో ప్రవేశ రుసుము పెంపు

హైదరాబాద్, నవంబర్ 17 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని ప్రధాన పార్కుల్లో ప్రవేశ రుసుమును జీహెచ్ఎంసీ పెంచింది. పెద్దల టికెట్ ధరను రూ.10 నుంచి రూ.20కి రెట్టింపు చేయగా, పిల్లల టికెట్ ధరను రూ.2 నుంచి రూ.5కు పెంచింది. కొత్త ధరలు తక్షణమే అమల్లోకి వస్తాయని అధికారులు తెలిపారు. ఇటీవల జరిగిన జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ప్రవేశ రుసుముల పెంపు ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. ఈ నిర్ణయంతో ఇందిరా పార్కు, నారాయణగూడలోని మేల్కొటే పార్కు, జలగం వెంగళరావు పార్కు, కృష్ణకాంత్ పార్కు తదితర ప్రధాన పార్కుల్లో కొత్త ధరలు వర్తించనున్నాయి. 12 ఏళ్లు దాటిన వారికి రూ.20, ఐదు నుంచి 12 ఏళ్లలోపు పిల్లలకు రూ.5 చొప్పున ప్రవేశ రుసుము వసూలు చేస్తారు. పార్కుల సందర్శన వేళల్లో మాత్రం ఎలాంటి మార్పులు చేయలేదు. గతంలో మాదిరిగానే ఉదయం 8 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు టికెట్లు జారీ చేస్తారు. జీహెచ్ఎంసీ చివరిసారిగా 2017లో ప్రవేశ రుసుమును రూ.5 నుంచి రూ.10కి పెంచింది. తొమ్మిదేళ్ల తర్వాత మరోసారి ధరలను సవరించినట్లు అర్బన్ బయోడైవర్సిటీ విభాగం వర్గాలు తెలిపాయి.



హైదరాబాద్‌కు మళ్లీ ఐమ్యాక్స్

ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో ఏఎంబీ విక్టరీ సినిమాస్

డిసెంబర్ 18న ప్రారంభించే యోచన

ఈవార్తలు, వినోదవాణి: హైదరాబాద్ సినీ ప్రేక్షకులకు దాదాపు 11 ఏళ్ల తర్వాత మళ్లీ ఐమ్యాక్స్ సినిమా అనుభవం అందుబాటులోకి రానుంది. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో నిర్మిస్తున్న 'ఏఎంబీ విక్టరీ సినిమాస్' మల్టీప్లెక్స్‌లో అత్యాధునిక ఐమ్యాక్స్ స్క్రీన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. భాగస్వామ్యంతో ఈ మల్టీప్లెక్స్‌ను నిర్మిస్తున్నారు. మొత్తం ఏడు స్క్రీన్లతో ఈ మల్టీప్లెక్స్ అందుబాటులోకి రానుంది. ఇందులో అత్యాధునిక 'ఐమ్యాక్స్ విత్ లేజర్' స్క్రీన్‌తో పాటు ఒక 4డీఎక్స్ స్క్రీన్, మరో ఐదు సాధారణ స్క్రీన్లు ఉంటాయని యాజమాన్యం వెల్లడించింది. ఐమ్యాక్స్ కార్పొరేషన్, ఏషియన్ సినిమాస్ మధ్య జూన్ 1న కుదిరిన ఒప్పందంతో హైదరాబాద్‌లో ఐమ్యాక్స్ ఏర్పాటు ఖరారైంది. డిసెంబర్ 18న మల్టీప్లెక్స్‌ను ప్రారంభించాలని ప్రాథమికంగా భావిస్తున్నారు. హాలీవుడ్ చిత్రం 'డ్యూన్: పార్ట్ త్రీ' ఈ ఐమ్యాక్స్ స్క్రీన్‌పై ప్రదర్శించే తొలి చిత్రం కావచ్చని సమాచారం. అయితే ప్రారంభ తేదీతో పాటు తొలి సినిమా వివరాలను యాజమాన్యం అధికారికంగా ఖరారు చేయాల్సి ఉంది. దశాబ్దానికి పైగా ఐమ్యాక్స్ సేవలకు దూరమైన హైదరాబాద్ ప్రేక్షకులకు కొత్త లేజర్ ప్రొజెక్షన్ సాంకేతికతతో సినిమా అనుభవం అందుబాటులోకి రానుంది

రోగికి మందులతోపాటు మనోధైర్యం

ఆప్యాయత, ఓర్పుతో వైద్య సేవలు.. డాక్టర్ మనోజ్‌రెడ్డికి ప్రశంసలు

హైదరాబాద్, నవంబర్ 17 (ఈవార్తలు): ప్రభుత్వ వైద్య సేవల్లో రోగులకు చికిత్స అందించడంతోపాటు వారి సమస్యలను ఓపికగా విని, ఆప్యాయంగా మాట్లాడటం ఎంతో ముఖ్యమని డాక్టర్ మనోజ్‌రెడ్డి తన సేవల ద్వారా చాటుతున్నారని పలువురు ప్రశంసిస్తున్నారు. రోగులకు తగిన సమయం కేటాయిస్తూ వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకుని చికిత్స అందిస్తున్నారని పేర్కొంటున్నారు. వైద్యం కోసం వచ్చే రోగుల సమస్యలను శ్రద్ధగా విని, వ్యాధి లక్షణాలు ఎప్పుడు మొదలయ్యాయి, గతంలో ఎలాంటి చికిత్స తీసుకున్నారు, ఎంతకాలంగా



ఇబ్బంది పడుతున్నారు వంటి వివరాలను తెలుసుకుని చికిత్స అందించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. మందులు రాసి ఇవ్వడానికే పరిమితం కాకుండా వ్యాధి స్వభావం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్స విధానాన్ని రోగులకు అర్థమయ్యేలా వివరిస్తున్నారని చెప్పారు. దీనివల్ల రోగుల్లో అనవసర భయాలు తగ్గి వైద్య సేవలపై నమ్మకం పెరుగుతోందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సందేహాలను నివృత్తి చేయడం, సమయపాలన పాటించడం, విధి నిర్వహణలో క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇవ్వడం ఆయన సేవల్లో ప్రత్యేకతలుగా పేర్కొన్నారు. వైద్యం అంటే కేవలం మందులు ఇవ్వడమే కాదని, రోగికి మనోధైర్యం కల్పించడం కూడా ముఖ్యమని పలువురు అభిప్రాయపడ్డారు. మానవీయ విలువలతో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ మనోజ్‌రెడ్డి సేవలు అభినందనీయమని ప్రశంసించారు.

సర్పంచ్ పదవికి రూ.25.60 లక్షల బిడ్

అనంతపురం, నవంబర్ 17 (ఈవార్తలు): గ్రామాభివృద్ధికి ఎక్కువ నిధులు ఇచ్చేందుకు ముందుకొచ్చిన వ్యక్తి కుటుంబానికి సర్పంచ్ పదవి ఇవ్వాలని గ్రామస్థులు నిర్ణయించిన ఘటన ఏపీలోని అనంతపురం జిల్లా బెలుగుప్ప మండలం నక్కలపల్లిలో చోటుచేసుకుంది. సర్పంచ్ అభ్యర్థి ఎంపిక కోసం నిర్వహించిన చీటీల ప్రక్రియలో స్థానిక నాయకుడు సుదర్శన్‌రెడ్డి తన భార్య అఖిల పేరుతో అత్యధికంగా రూ.25.60 లక్షలు ఇస్తామని ప్రతిపాదించారు. దీంతో అఖిలను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు గ్రామస్థులు అంగీకరించినట్లు సమాచారం. నక్కలపల్లి సర్పంచ్ స్థానం ఈసారి మహిళకు రిజర్వ్ అయింది. ఈ నేపథ్యంలో పలువురు పదవిని ఆశించారు. అయితే ఎన్నికల్లో భారీగా ఖర్చు చేయడానికి బదులు ఆ మొత్తాన్ని గ్రామాభివృద్ధికి ఉపయోగిస్తే బాగుంటుందనే ప్రతిపాదన వచ్చింది. దీంతో పోటీకి ఆసక్తి ఉన్నవారు గ్రామాభివృద్ధికి ఎంత మొత్తం ఇవ్వగలరో చీటీలపై రాసి డబ్బాలో వేయా లని నిర్ణ యిం చారు. మొత్తం తొమ్మిది మంది ఈ ప్రక్రియలో పాల్గొ న్నారు. గ్రామ స్థుల సమక్షంలో చీటీలను తెరిచి చూడ గా సుదర్శన్‌రెడ్డి తన భార్య అఖిల పేరుతో అత్యధికంగా రూ.25.60 లక్షలు ప్రతిపాదించారు. దీంతో ఆమెను ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నుకోవాలని గ్రామస్థులు నిర్ణయించినట్లు తెలుస్తోంది. గతంలోనూ ఇదే గ్రామంలో రూ.21 లక్షల విరాళం ప్రతిపాదనతో ఇదే తరహాలో అభ్యర్థిని ఎంపిక



చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే గ్రామస్థులు నిర్వహించిన ఈ చీటీల ప్రక్రియకు చట్టబద్ధమైన గుర్తింపు ఉండదు. సర్పంచ్ ఎన్నిక రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలు, పంచాయతీరాజ్ చట్టం ప్రకారమే జరగాలి. ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్లు, పరిశీలన వంటి అధికారిక ప్రక్రియలు పూర్తయిన తర్వాతే ఏకగ్రీవ ఎన్నిక చెల్లుబాటు అవుతుంది.

మణుగూరులో వరుస ప్రకంపనలు.. ప్రజల్లో భయాందోళన

ఉదయం రెండుసార్లు కంపించిన భూమి

సింగరేణి బ్లాస్టింగా, భూకంపమా అనే సందేహాలు

మణుగూరు, నవంబర్ 17 (ఈవార్తలు): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం వరుస ప్రకంపనలు రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. స్వల్ప వ్యవధిలో రెండుసార్లు భూమి కంపించడంతో పలువురు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. కొన్ని ప్రాంతాల్లో భారీ శబ్దాలు వినిపించడంతో స్థానికులు ఆందోళన చెందారు. స్థానికుల వివరాల ప్రకారం.. మల్లేపల్లి ఓపెన్‌కాస్ట్ గని సమీపంలో ఉదయం 11.28 గంటలకు మొదటిసారి ప్రకంపనలు వచ్చాయి. అనంతరం 11.40 గంటల ప్రాంతంలో మరోసారి భూమి కంపించింది. మణుగూరు పట్టణంతో పాటు రాజుపేట, విఠల్‌రావునగర్, పీకే-1, బావనకుంట, కొత్త కొండాపురం ప్రాంతాల్లోనూ ప్రకంపనలు వచ్చినట్లు స్థానికులు తెలిపారు. భూగర్భ గనులకు సమీపంలోని శివలింగపురంలో మూడుసార్లు భారీ శబ్దాలు వినిపించాయని, ఇళ్ల పైకప్పులు



కంపించాయని చెప్పారు. సాధారణంగా సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనుల్లో మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో బ్లాస్టింగ్ జరుగుతుందని స్థానికులు చెబుతున్నారు. అయితే మంగళవారం ఉదయమే భారీ శబ్దాలతో ప్రకంపనలు రావడంతో ఇవి గనుల్లో బ్లాస్టింగ్ వల్ల వచ్చాయా? లేక సహజ భూకంపమా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రకంపనల తీవ్రత, భూకంప కేంద్రానికి సంబంధించి అధికారిక సమాచారం ఇంకా వెలువడలేదు. సాయంత్రం వరకు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ (ఎన్‌సీఎస్) పోర్టల్‌లోనూ ఈ ఘటనకు సంబంధించిన వివరాలు నమోదు కాలేదని సమాచారం. గోదావరి లోయ ప్రాంతంలో గతంలోనూ స్వల్ప భూప్రకంపనలు నమోదయ్యాయి. ఈ ఏడాది జూన్‌లో మణుగూరు పరిసరాల్లో 3.8 తీవ్రతతో భూకంపం నమోదైనట్లు కథనంలో పేర్కొన్నారు. తాజా ప్రకంపనలకు కారణం ఏమిటనే దానిపై సింగరేణి యాజమాన్యం, జిల్లా అధికారులు, సిస్మాలజీ విభాగం నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

సమ్మక్క సాగర్‌కు ఎన్ఓసీ ఇవ్వండి

ఛత్తీస్‌గఢ్ సీఎంకు రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

పరిహారం, పునరావాస నిధులు ఇచ్చేందుకు సిద్ధమని వెల్లడి

రాయ్‌పూర్, నవంబర్ 17 (ఈవార్తలు): ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద గోదావరి నదిపై నిర్మించిన సమ్మక్క సాగర్ బరాజ్‌కి వెంటనే నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) జారీ చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని కోరారు. నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి రాయ్‌పూర్‌లో ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయితో సమావేశమయ్యారు. ప్రాజెక్టు వివరాలను ఆయనకు వివరించి, ఎన్ఓసీ ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై విష్ణుదేవ్ సాయి సానుకూలంగా స్పందించి, అనుమతుల ప్రక్రియను త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణలో తాగు, సాగునీటి అవసరాలు పెరిగే అవకాశం ఉందని రేవంత్‌రెడ్డి వివరించారు. సమ్మక్క సాగర్ బరాజ్‌లో నీటిని నిల్వ చేసుకునేందుకు



అనుమతించాలని కోరారు. కరవు ప్రభావిత, వెనుకబడిన, గిరిజన ప్రాంతాలకు గోదావరి జలాలను అందించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని తెలిపారు. గతంలో కాంతనపల్లి వద్ద ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టు వల్ల 11,408 ఎకరాల భూమి ముంపునకు గురయ్యే పరిస్థితి ఉండేదని వివరించారు. దీంతో 17 ఆదివాసీ గ్రామాలు మునిగిపోయే ప్రమాదం ఉండటంతో ముంపును తగ్గించేందుకు బరాజ్ నిర్మాణ ప్రాంతాన్ని తుపాకులగూడెంకు మార్చినట్లు తెలిపారు. ప్రాజెక్టు ప్రభావంపై అధ్యయనం కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కోరిన మేరకు తెలంగాణ ప్రభుత్వం ఏప్రిల్‌లోనే రూ.9.883 కోట్లు చెల్లించిందని పేర్కొన్నారు. అనంతరం ఐఐటీ ఖరగ్‌పూర్ క్షేత్రస్థాయి అధ్యయనం పూర్తి చేసి జూలై 30న ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి నివేదిక అందజేసిందని తెలిపారు. తుపాకులగూడెం వద్ద బరాజ్ వల్ల ఛత్తీస్‌గఢ్ పరిధిలో సాధారణ పరిస్థితుల్లో 33 ఎకరాల భూమి మాత్రమే ముంపునకు గురవుతుందని, భారీ వరదలు వచ్చినా ముంపు విస్తీర్ణం 100 ఎకరాలకు మించదని నివేదికలో పేర్కొన్నట్లు వివరించారు. తుపాకులగూడెం వద్ద ఇప్పటికే బరాజ్ నిర్మాణం పూర్తయిందని, పూర్తిస్థాయి నీటిమట్టం +83 మీటర్ల వద్ద 6.94 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉందని తెలిపారు. ఛత్తీస్‌గఢ్ పరిధిలో అవసరమైన భూసేకరణ, పరిహారం, పునరావాస చర్యలకు నిబంధనల ప్రకారం నిధులు చెల్లించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎన్ఓసీతో పాటు మిగిలిన అనుమతులను త్వరగా మంజూరు చేయాలని రేవంత్‌రెడ్డి కోరారు.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజానమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.

బిలియన్ వ్యూస్‌కు చేరువలో 'రాను బొంబాయికి రాను

ఈవార్తలు, వినోదవాణి: తెలంగాణ జానపద గీతం 'రాను బొంబాయికి రాను' యూట్యూబ్‌లో బిలియన్ వ్యూస్ మైలురాయికి చేరువైంది. 2025లో విడుదలైన ఈ పాటకు ఇప్పటివరకు సుమారు 95.7 కోట్ల వ్యూస్ వచ్చినట్లు సమాచారం. తక్కువ బడ్జెట్‌తో రూపొందిన ఈ జానపద పాటకు సోషల్ మీడియాలో భారీ ఆదరణ లభిస్తోంది. జానపద కళాకారుడు రాము రాథోడ్ ఈ పాటకు సాహిత్యం అందించడంతో పాటు స్వయంగా ఆలపించారు. సుమారు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల బడ్జెట్‌తో వీడియోను రూపొందించారు. వేములవాడ, జగిత్యాల పరిసర గ్రామీణ ప్రాంతాల్లో పాటను చిత్రీకరించారు. తెలంగాణ పల్లె జీవనం, స్థానిక యాసను ప్రతిబింబించే సాహిత్యం, ఆకట్టుకునే బాణీ ఈ పాటకు ప్రత్యేక గుర్తింపు తెచ్చాయి. పెళ్లిళ్లు, పండుగలు, జాతరల్లో ఈ పాట విస్తృతంగా వినిపిస్తోంది. సోషల్ మీడియాలో రీల్స్, షార్ట్స్ రూపంలో పెద్ద ఎత్తున షేర్ కావడంతో వ్యూస్ భారీగా పెరిగాయి. యూట్యూబ్ ప్రకటనల ద్వారా ఈ పాటకు రూ.1.5 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు ఆదాయం వచ్చి ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. అయితే ఈ ఆదాయానికి సంబంధించి అధికారిక వివరాలు అందుబాటులో లేవు. దాదాపు 16 ఏళ్లుగా జానపద సంగీత రంగంలో కొనసాగుతున్న రాము రాథోడ్‌కు ఈ పాట భారీ గుర్తింపు తెచ్చింది. బిగ్‌బాస్ రియాలిటీ షోలో పాల్గొనే అవకాశానికీ ఈ ప్రజాదరణ దోహదపడినట్లు కథనంలో పేర్కొన్నారు. తక్కువ వ్యయంతో రూపొందిన ప్రాంతీయ జానపద గీతం దాదాపు వంద కోట్ల వ్యూస్‌కు చేరువ కావడం విశేషంగా నిలుస్తోంది.



మెట్‌పల్లిలో రాజకీయ ఘర్షణ.. ఉద్రిక్తత

ఎమ్మెల్యే నివాస ముట్టడికి కాంగ్రెస్ పిలుపు

మెట్‌పల్లి, నవంబర్ 17 (ఈవార్తలు): మెట్‌పల్లిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య రాజకీయ వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కుమార్ నివాస ముట్టడికి కాంగ్రెస్ నాయకులు పిలుపునివ్వడంతో ఇరుపార్టీల కార్యకర్తలు ఎదురెదురుగా వచ్చి వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో ఘర్షణ చోటుచేసుకున్నట్లు సమాచారం. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మున్సిపల్ కార్మికులను వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకుంటున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. దీనికి నిరసనగా ఆయన నివాస ముట్టడికి పిలుపునిచ్చారు. దీంతో రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. మరోవైపు సోనియా గాంధీపై ఇతర పార్టీల నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ శ్రేణులు పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ఎదుట నిరసన చేపట్టాయి. సంబంధిత నాయకుల దిష్టిబొమ్మను దహనం చేశాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఖలీద్ మాట్లాడుతూ సోనియా గాంధీ రచించిన పుస్తకాన్ని పూర్తిగా చదవకుండానే విమర్శలు చేయడం సరికాదన్నారు. వాస్తవాలు తెలుసుకున్న తర్వాతే వ్యాఖ్యలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ సీనియర్ నాయకుడు కొమిరెడ్డి విజయ్ ఆజాద్, ఎర్రోళ్ల హనుమాన్లు, సురభి అశోక్, జట్టిలింగం, ఎండీ షాకీర్, సంగు గంగాధర్, ప్రణయ్, దాసరి బాబు,



పల్లికొండ ప్రవీణ్, కొమ్ముల సంతోష్‌రెడ్డి, నదీమ్, కృష్ణమూర్తి, న్యాయవాదులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో రామగుండానికి ఒరిగిందేమిటి?

హామీల అమలేది.. అభివృద్ధి పనుల పరిస్థితి ఏది?

ఎమ్మెల్యే మక్కన్‌సింగ్‌ను ప్రశ్నించిన మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు, అనేక హామీలతో అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ విమర్శించారు. నియోజకవర్గంలో ప్రస్తుత పాలకులు చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కన్‌సింగ్‌ను ప్రశ్నించారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలకు ఇచ్చిన హామీలు, విద్యార్థినులకు స్కూటీలు, నిరుద్యోగ భృతి, వృద్ధులు, దివ్యాంగులకు పెంచుతామని ప్రకటించిన పింఛన్లపై ప్రభుత్వం సమాధానం చెప్పడం లేదన్నారు. కళ్యాణలక్ష్మి పథకం కింద రూ.1,00,116 ఆర్థిక సాయంతోపాటు తులం బంగారం ఇస్తామన్న హామీ అమలు కావడం లేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రామగుండంలో తాగునీరు, పారిశుద్ధ్య వాహనాలు, రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. పట్టణ అభివృద్ధికి అప్పటి సీఎం కేసీఆర్ సీఎం ప్లాన్ గ్రాంట్ కింద సుమారు రూ.200 కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. కూరగాయలు, మాంసం మార్కెట్లు, పార్కింగ్ కాంప్లెక్స్‌లు, మల్టీప్లెక్స్ థియేటర్, చౌరస్తాల సుందరీకరణ వంటి పనులు చేపట్టామని వివరించారు. గతంలో అభివృద్ధి పనులకు గుర్తుగా ఏర్పాటు చేసిన పైలాన్‌ను కూల్చివేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. లక్ష్మీనగర్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పాత మున్సిపల్ కార్యాలయం వద్ద పార్కింగ్ కాంప్లెక్స్, మల్టీప్లెక్స్ థియేటర్ నిర్మాణానికి రూ.8 కోట్లు కేటాయించామని తెలిపారు. టెండర్లు పూర్తయి రూ.2 కోట్ల మేర పనులు జరిగినా మిగిలిన పనులను పూర్తి చేయడం లేదని ఆరోపించారు. ఈ అంశంపై బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ సమ్మయ్య యాదవ్ ప్రశ్నిస్తే మాట్లాడేందుకు



అవకాశం ఇవ్వకుండా మైకులు కట్ చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కౌశిక హరి, వాళ్ల హరీష్‌రెడ్డి, ఫ్లోర్ లీడర్ మేకల సమ్మయ్య యాదవ్, మూల విజయరెడ్డి, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఆటో చోరీ

మల్యాల, నవంబర్ 17 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కొండగట్టు వద్ద మద్యం మత్తులో ఓ యువకుడు ఆటోను చోరీ చేసి పారిపోతుండగా కొద్దిదూరంలోనే ప్రమా దానికి గురయ్యాడు. జూలపల్లి మండలం నందిపేటకు చెందిన బండి నరేశ్ తన కుమార్తె పుట్టువెంట్రుకల కార్యక్రమం సంద ర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించు కున్నారు. తిరుగు ప్రయాణంలో స్టేజీ సమీపంలోని ఓ టౌన్‌షిప్ వద్ద భోజనం చేసేందుకు ఆటోను నిలిపారు. అదే సమ యంలో నిజామాబాద్ జిల్లా షాపూర్ గ్రామా నికి చెందిన ప్రవీణ్‌గౌడ్ అనే యువకుడు మద్యం మత్తులో ఆటోను తీసుకుని పారిపో యినట్లు సమాచారం. ఇది గమనించిన నరేశ్ ఆటోను వెంబడించి ఎక్కేందుకు ప్రయ త్నించగా యువకుడు తోసేయడంతో కింద పడి స్వల్పంగా గాయపడ్డాడు. అనంతరం ఆటోను రాంగ్ రూట్‌లో వేగంగా నడు పుకుంటూ వెళ్లిన యువకుడు కొద్ది దూరంలోనే అదుపుతప్పి బోల్తా పడేశాడు. సమాచారం అందుకున్న బ్లూకోల్ట్స్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.



వేములవాడలో ఘనంగా గోపాష్టమి వేడుకలు

వేములవాడ అర్బన్, నవంబర్ 17 (ఈవార్తలు): కార్తీక శుద్ధ అష్టమి సందర్భంగా విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలోని గాయత్రీ దేవాలయంలో గోపాష్టమి వేడుకలను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గోమాతకు ప్రత్యేక పూజలు చేసి గ్రాసం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో గోవుకు ప్రత్యేక స్థానం ఉందని, ప్రతి ఒక్కరూ గోసంరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వీహెచ్‌పీ నూతన గోరక్ష ప్రముఖ్‌గా గన్నమనేని ప్రదీప్‌రావును నియమించినట్లు ప్రకటించారు. తనకు ఈ బాధ్యత అప్పగించిన క్షేత్ర ప్రముఖ్ గుమ్మల సత్యం, విభాగ్ సహ కార్యదర్శి గజం రాజు, జిల్లా కార్యదర్శి గడప కిషోర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు నాగుల రాముగౌడ్‌కు ప్రదీప్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ పట్టణ అధ్యక్షుడు పల్లె శ్యామ్‌సుందర్‌రెడ్డి, కార్యదర్శి గుండోజు గోపాల్, సనుగుల భాస్కర్, తిప్పర్తి సాయికృష్ణ, తిప్పర్తి రమేష్, దండి గణేష్, కొక్కు గోపాలకృష్ణ, నంది శివకుమార్, నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.



కొండగట్టు చందనోత్సవానికి గవర్నర్, డిప్యూటీ సీఎంకు ఆహ్వానం

మల్యాల, నవంబర్ 17 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో సుమారు 60 ఏళ్ల తర్వాత నిర్వహించనున్న చందనోత్సవ మహోత్సవానికి రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్ల, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలను ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు ఆహ్వానించారు. చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ ఎం. హనుమంతరావు, ధార్మిక సలహాదారు గోవింద హరి, ఆలయ ఈవో ఎస్. అంజనా రెడ్డి, పర్యవేక్షకుడు సునీల్‌కుమార్, వేదపారాయణదారులు, అర్చకులు, దేవస్థాన సిబ్బంది గవర్నర్‌ను లోక్‌భవన్‌లో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. అలాగే ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి చందనోత్సవానికి హాజరుకావాలని కోరారు. ఆరు దశాబ్దాల తర్వాత నిర్వహించనున్న ఈ వేడుకలో భక్తులకు స్వామివారి నిజరూప దర్శనం కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు.



భవన నిర్మాణ కార్మికులకు సంఘ భవనం కేటాయించాలి

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 17 (ఈవార్తలు): భవన నిర్మాణ కార్మిక సంఘానికి ప్రత్యేక భవనం నిర్మించడంతోపాటు లేబర్ అడ్డలో మూత్రశాలలు ఏర్పాటు చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు అక్కెనపెల్లి భాస్కర్ డిమాండ్ చేశారు. సిరిసిల్లలోని నటరాజ్ టాకీస్ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో సంఘ భవనానికి నిధులు మంజూరు చేయాలని, మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న లేబర్ అడ్డలో మూత్రశాలలు నిర్మించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలోనే సంఘ భవనం కోసం అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలోనూ తహసీల్దార్, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యలను వివరించినట్లు తెలిపారు. సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి కూడా సమస్యలను తీసుకెళ్లామన్నారు. లేబర్ అడ్డలో మూత్రశాలలు లేక కార్మికులతోపాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు అందే సుదర్శన్, ఎస్‌కే షాదుల్లా, కోడి ముంజ, గంగాధర్, శంకర్, యాకూబ్, రమేష్, శివ, సత్యం, నవీన్, బాల్‌రాజ్, మహేష్, శ్రీకాంత్, సంజీవ్, రుక్మవ్వ, పోసవ్వ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌పీవీ టీకాల లక్ష్యం పూర్తి చేయాలి

జగిత్యాల, నవంబర్ 17 (ఈవార్తలు): హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌తోపాటు తల్లి, శిశు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని హెల్త్ కమిషనర్ ఆదేశించారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో 9 నుంచి 14 ఏళ్ల బాలికలకు టీకాలు అందించి లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. గర్భిణులకు వైద్య పరీక్షలు, పోషకాహారం, ఆసుపత్రుల్లో ప్రసవాలు, శిశువులకు టీకాలు తప్పనిసరిగా అందేలా చూడాలన్నారు. ఆశా, ఏఎన్ఎంలు ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, డాక్టర్లు శ్రీనివాస్, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో టైలర్ ఆత్మహత్య

జగిత్యాల, నవంబర్ 17 (ఈవార్తలు): అప్పుల బాధతో జగిత్యాల పట్టణానికి చెందిన టైలర్ శంకర్ (42) ఆత్మహత్య చేసుకున్నాడు. తీన్‌ఖని చౌరస్తా వద్ద శ్రీరాం టైలర్స్ నిర్వహిస్తున్న ఆయన మంగళవారం తన దుకాణంలో ఉరివేసుకుని మృతి చెందాడు. వ్యాపారం సరిగా సాగక అప్పులు పెరిగిపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



ఉత్సాహంగా త్రిశూల్ యూత్ క్యారమ్ పోటీలు

విజేతలకు రూ.10 వేలు, రూ.5 వేల నగదు బహుమతులు

మల్యాల, నవంబర్ 17 (ఈవార్తలు): యువతలో క్రీడాస్ఫూర్తి, స్నేహభావం, ఐకమత్యాన్ని పెంపొందించేందుకు త్రిశూల్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యారమ్ పోటీలు ఉత్సాహంగా ముగిశాయి. పలువురు క్రీడాకారులు పాల్గొని ప్రతిభ చాటుకున్నారు. పోటీల్లో కిరణ్, సాయి మొదటి స్థానంలో నిలవగా, ప్రదీప్, అనిల్ రెండో స్థానాన్ని దక్కించుకున్నారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.10 వేలు, రెండో బహుమతిగా రూ.5 వేల నగదు అందజేశారు. కార్యక్రమానికి మల్యాల సర్పంచ్ బొట్ల జయప్రసాద్, ఎస్సై సునీల్ దుబ్బాక ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. ఇలాంటి పోటీలు స్నేహభావం, క్రమశిక్షణను పెంపొందిస్తాయన్నారు. త్రిశూల్ యూత్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దూస వెంకన్న, జవాజి శ్రీను, త్రిశూల్ యూత్ సభ్యులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

కొండగట్టులో 6 రోజులు మూలవిరాట్ దర్శనం నిలిపివేత

మల్యాల, నవంబర్ 17 (ఈవార్తలు): కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో మూలవిరాట్ దర్శనాన్ని ఆదివారం మధ్యాహ్నం నుంచి ఆరు రోజుల పాటు నిలిపివేశారు. దర్శనం నిలిపివేయనున్న నేపథ్యంలో ఆదివారం ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఉదయం ఆలయ ఋత్విక్కులు, వేద పండితులు, అర్చకులు ప్రత్యేక వైదిక క్రతువులు నిర్వహించారు. స్వస్తివాచనం, సభానుజ్ఞా స్వీకారం, విష్వక్సేనారాధనం, వాసుదేవ పుణ్యాహం, ఋత్విగ్వరణం, బాలాలయ కుంభావాహనం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. అనంతరం మధ్యాహ్నం 12.15 గంటలకు మూలవిరాట్ దర్శనాన్ని నిలిపివేశారు. ఈ ఆరు రోజుల పాటు భక్తుల దర్శనార్థం ఆలయంలో స్వామివారి చెక్క ప్రతిమను ప్రతిష్ఠించారు. మరోవైపు యాగశాలలో వేద పండితుల ఆధ్వర్యంలో హోమాలు కొనసాగుతున్నాయి.

విద్యాభివృద్ధితోనే బలమైన సమాజం

జగిత్యాల, నవంబర్ 17 (ఈవార్తలు): పిల్లల విద్య, పెంపకం, ఉజ్వల భవిష్యత్తు కోసం కృషి చేయడమే బలమైన సమాజ నిర్మాణానికి పునాది అని వక్తలు పేర్కొన్నారు. మంగళవారం జగిత్యాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. డీసీసీ మైనారిటీ అధ్యక్షుడు ఖాజా నయీముద్దీన్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, ముస్లిం సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ బారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆదిల్ పటేల్, ముజాహిద్ పట్వారి, మీర్ యాసీన్ అలీ అషర్, షాజీ ఫిరోజ్, రిటైర్డ్ హెడ్మాస్టర్లు మునీముద్దీన్, నసీముద్దీన్, కౌన్సిలర్ అబ్దుల్ వాసెద్, హెచ్ఎం అబ్దుల్లా బేగ్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడలో 150 మందికి అన్నదానం

2048 రోజులుగా సేవా కార్యక్రమం: మై వేములవాడ ట్రస్ట్

వేములవాడ అర్బన్, నవంబర్ 17 (ఈవార్తలు): మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం భీమేశ్వర ఆలయం సమీపంలోని పార్వతీపురం ధర్మశాల వద్ద 150 మంది పేదలు, భక్తులకు అన్నదానం నిర్వహించారు. దాతల సహకారంతో 2048 రోజులుగా అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు ట్రస్ట్ నిర్వాహకుడు మధు మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు అందించే ప్రతి రూపాయి ఆకలితో ఉన్నవారి కడుపు నింపేందుకు ఉపయోగపడుతోందన్నారు. పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు, పండుగలు, పితృదేవతల



స్మరణ వంటి సందర్భాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నూతన దంపతులు ప్రతాప సుచేత్ శర్మ, సుమయి వివాహం సందర్భంగా వారి కుటుంబ సభ్యులు ప్రతాప సంపత్, స్వప్న దంపతులు అన్నదానానికి సహకరించినట్లు తెలి పారు. శాశ్వత దాతలుగా జువ్వాడి వెంకటే శ్వరరావు, స్నేహలత, ప్రతాప స్వప్న సంపత్, నగుబోతు రవీందర్, జ్యోతి, గణాచారి సాంబశివ్, శైలజ, దేవరాజు, ఉమ, బాలచందర్ రాజు, రామడుగు శ్రీలత కుటుంబ సభ్యులు, ప్రజ్ఞ, శరత్‌చంద్ర, శిరీష, సాయిచంద్ర, శర్వాణి, రవిచంద్ర దంపతులు, చిన్నారులు శ్రీహర్ష, సాయికృష్ణ సహకరిస్తున్నట్లు వివరించారు. అన్నదానానికి సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆకలి లేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మధు మహేష్, వొడ్యాల వేణు, ప్రతాప నటరాజు, పసుల శ్రీధర్, మధు కవిత, నీలం ప్రసాద్, గొట్టం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గంగాధర మండలంలో 897 మందికి చేయూత పింఛన్లు

మంజూరు పత్రాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, నవంబర్ 17 (ఈవార్తలు): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. మంగళవారం గంగాధర మండలం మధురానగర్‌లోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడేతో కలిసి ఎమ్మెల్యే సత్యం మండలంలోని 33 గ్రామాలకు చెందిన 897 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గంగాధర మండలంలో 389 వితంతు, 26 దివ్యాంగుల, 101 గీత కార్మిక, 75 ఒంటరి మహిళ, 126 చేనేత పింఛన్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. చొప్పదండి నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్ అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 200 యూనిట్ల వరకు ఉచిత



విద్యుత్, పేదలకు ఉచిత సన్నబియ్యం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అంబటి రజిత, ఎంపీడీవో రామ్, మండల సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి అప్రజాస్వామికం

బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి: జీవన్‌రెడ్డి

జగిత్యాల, నవంబర్ 17 (ఈవార్తలు): కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు దాడికి పాల్పడ్డారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. జీవన్‌రెడ్డి ఆరోపించారు. ఈ ఘటనను తీవ్రంగా



ఖండిస్తున్నట్లు మంగళవారం తెలిపారు. ప్రజల్లో ఎమ్మెల్యేకు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక భయభ్రాంతులకు గురిచేసేలా దాడులకు పాల్పడటం అప్రజాస్వామికమని విమర్శించారు. దాడికి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే నివాసంపై దాడి అప్రజాస్వామికం: వసంత

జగిత్యాల, నవంబర్ 17 (ఈవార్తలు): మెట్‌పల్లిలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కుమార్ నివాసంపై కాంగ్రెస్ నాయకులు చేపట్టిన ముట్టడి, దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ప్రజా తీర్పును జీర్ణించుకోలేక కాంగ్రెస్ నాయకులు కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాజకీయంగా ఎదుర్కోవాలంటే అభివృద్ధిలో పోటీ పడాలని, ఎన్నికల హామీల అమలుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు

జగిత్యాల, నవంబర్ 17 (ఈవార్తలు): మద్యం సేవించి వాహనం నడిపిన అహ్మద్ వజీద్ ఖాన్‌కు జగిత్యాల స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ఆరు రోజుల సాధారణ జైలు శిక్ష విధించింది. మోటార్ వెహికల్స్ యాక్ట్ సెక్షన్ 185 కింద నమోదైన కేసులో మంగళవారం నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా పట్టణ సీఐ పి. కరుణాకర్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. వాహనదారులు తమతోపాటు ఇతరుల ప్రాణాలకు ముప్పు కలిగించవద్దని సూచించారు.

రాహుల్ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం: ఏసీఎస్ రాజు

జగిత్యాల, నవంబర్ 17 (ఈవార్తలు): హైదరాబాద్‌లో జరిగిన భారత్ సమ్మిట్ ముగింపు సభలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు తెలిపారు. మంగళవారం విద్యానగర్‌లోని కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నాయకులు అక్కినపల్లి కాశీనాథం, చిట్ల గంగాధర్ మాట్లాడుతూ విదేశీ ప్రతినిధుల సమక్షంలో దేశ ప్రజాస్వామ్యంపై విమర్శలు చేయడం దేశ గౌరవానికి భంగం కలిగించడమేనని అభిప్రాయపడ్డారు. ఇటలీ నేత ఫిలిబెక్ భారత ప్రజాస్వామ్యంపై చేసిన వ్యాఖ్యలను కూడా ఖండించారు. కాన్ఫరెన్స్ వీసాపై వచ్చి రాజకీయ వ్యాఖ్యలు చేయడంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో 22వ వార్డు కౌన్సిలర్ అరవ లక్ష్మి, సింగం గంగాధర్, వేముల దేవరాజం తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మబండలో నేడు చేయూత పింఛన్ల పత్రాల పంపిణీ

కూకట్‌పల్లి, నవంబర్ 17 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన చేయూత ఆసరా పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఎల్లమ్మబండలో నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు గోదాకృష్ణ ఫంక్షన్ హాల్‌లో జరిగే ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. తాజా మాజీ కార్పొరేటర్లు కూడా పాల్గొననున్నారు. నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

గూగుల్ మ్యాప్స్‌లో కొత్త ఏఐ ఫీచర్లు

ట్రిప్ ప్లానింగ్ నుంచి అపాయింట్‌మెంట్ సెర్చ్ వరకు కొత్త సదుపాయాలు

న్యూఢిల్లీ, నవంబర్ 17 : గూగుల్ మ్యాప్స్ యూజర్ల కోసం గూగుల్ కొత్త ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఫీచర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. 'ఆస్క్ మ్యాప్స్' టూల్ ద్వారా ప్రయాణ ప్రణాళికలు రూపొందించుకోవడంతో పాటు సమీపంలోని వ్యాపార సంస్థల్లో అపాయింట్‌మెంట్ల వివరాలను తెలుసుకోవచ్చు. ఆండ్రాయిడ్, ఐఓఎస్ ప్లాట్‌ఫామ్‌లలో ఈ అప్‌డేట్‌ను విడుదల చేసింది. త్త ఫీచర్లతో పలు రోజుల ట్రిప్ షెడ్యూల్‌ను సులభంగా తయారు చేసుకోవచ్చు. ప్రయాణంలో సందర్శించాల్సిన ప్రదేశాలు, ప్రతి స్టాప్‌కు సంబంధించిన సమయాలు, రూట్ వివరాలను ఏఐ సూచిస్తుంది. మధ్యలో కొత్త ప్రదేశాలు, హోటళ్లు చేర్చాలనుకుంటే వెంటనే ప్లాన్‌ను మార్చుకోవచ్చు. ఈ షెడ్యూల్‌ను స్నేహితులతో షేర్ చేసుకోవడంతో పాటు డెస్క్‌టాప్‌లో గూగుల్ డాక్స్‌కు ఎక్స్‌పోర్ట్ చేసుకోవచ్చు. ప్రయాణ మార్గంలోని పార్కింగ్ సదుపాయాలు, ఈవీ ఛార్జింగ్ పాయింట్లు, ట్రాఫిక్, వాతావరణం, టోల్ వివరాలను కూడా తెలుసుకోవచ్చు. కార్ సర్వీసింగ్, బ్యూటీ పార్లర్లు, పెట్ కేర్ వంటి సేవలకు సమీపంలో ఖాళీ అపాయింట్‌మెంట్ స్లాట్లను గుర్తించే సదుపాయాన్ని కల్పించింది. అవసరమైతే ఏఐ అసిస్టెంట్ సంబంధిత సంస్థలకు కాల్ చేసి వివరాలు సేకరిస్తుంది. సేవ్



చేసుకున్న రెస్టారెంట్లలో టేబుల్ అందుబాటును కూడా తెలుసుకోవచ్చు. గూగుల్ మ్యాప్స్ సేవలు యూరప్‌లో మరో 30 దేశాలకు విస్తరించడంతో మొత్తం 200కు పైగా దేశాల్లో అందుబాటులోకి వచ్చాయి. అయితే అపాయింట్‌మెంట్ సెర్చ్ వంటి ప్రత్యేక ఏఐ ఫీచర్లను ప్రస్తుతం అమెరికాలో ప్రారంభించారు. త్వరలో ఇతర ప్రాంతాలకూ విస్తరించనున్నారు.



అమెరికాలో ఇరాన్ 'డర్టీ బాంబ్'?

నిఘా వర్గాల హెచ్చరికలతో భద్రత పెంపు

ఆరోపణలను ఖండించిన టెహ్రాన్

వాషింగ్టన్, నవంబర్ 17 : అమెరికా రాజధాని వాషింగ్టన్‌లో ఉన్నతాధికారులను లక్ష్యంగా చేసుకుని రసాయన దాడి లేదా రేడియోధార్మిక పదార్థాలతో కూడిన 'డర్టీ బాంబ్' దాడికి ఇరాన్ ప్రణాళిక రచిస్తోందన్న అనుమానాలు కలకలం రేపుతున్నాయి. అమెరికా నిఘా వర్గాల సమాచారం ఆధారంగా సీఎన్ఎన్ ఈ అంశంపై కథనం ప్రచురించినట్లు మూల వార్త పేర్కొంది. అయితే ఈ ఆరోపణలను ఇరాన్ ఖండించింది. దాడులకు సంబంధించిన నిర్దిష్ట ప్రాంతాలు, లక్ష్యాల వివరాలు నిఘా వర్గాలకు అందినట్లు అమెరికా అధికారులు తెలిపారని కథనం పేర్కొంది. హెచ్చరికల నేపథ్యంలో భద్రతా చర్యలను పెంచినట్లు వెల్లడించింది. ప్రస్తుతం అమెరికాకు తక్షణ ప్రమాదం లేదని, పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామని వైట్‌హౌస్ ప్రతినిధి లారెన్ బిస్ పేర్కొన్నట్లు తెలిపింది. ఇటీవల మినాబ్ పాఠశాలపై జరిగిన దాడిలో 123 మంది చిన్నారులు మరణించారని, ఈ ఘటనకు బాధ్యులుగా పేర్కొంటూ ఇద్దరు అమెరికా నేవీ అధికారులకు ఇరాన్ హెచ్చరికలు జారీ చేసినట్లు కథనం వివరించింది. ఈ పరిణామాల నేపథ్యంలో అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్‌ను ఆయన నివాసం నుంచి సురక్షితమైన మిలిటరీ స్థావరానికి తరలించినట్లు పేర్కొంది. హార్మూజ్ జలసంధి దిగ్బంధనం, యుద్ధ పరిస్థితుల కారణంగా ఇప్పటికే ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయని తెలిపింది. డర్టీ బాంబ్ అనేది అణుబాంబు తరహాలో అణు విచ్ఛిత్తి ద్వారా పేలే ఆయుధం కాదు. సాధారణ పేలుడు ద్వారా రేడియోధార్మిక పదార్థాలను వ్యాప్తి చేసే ప్రమాదకరమైన పరికరం. దీనివల్ల ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి ముప్పు ఏర్పడవచ్చు. అమెరికాలోని వ్యక్తుల సహకారంతో దాడికి అవసరమైన సామగ్రిని సిద్ధం చేసి ఉండవచ్చని నిఘా వర్గాలు అనుమానిస్తున్నట్లు కథనం పేర్కొంది. అయితే రసాయన ఆయుధాల వినియోగాన్ని తాము వ్యతిరేకిస్తామని ఐక్యరాజ్యసమితిలోని ఇరాన్ మిషన్ స్పష్టం చేసింది. తమపై వస్తున్న ఆరోపణలు నిరాధారమని ఖండించింది.



డాలర్‌పై బలపడిన రూపాయి

31 పైసలు లాభం.. 93.62 వద్ద ట్రేడింగ్

ముంబై, నవంబర్ 17 : అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ మంగళవారం బలపడింది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గడం, దేశీయ మార్కెట్లలోకి విదేశీ పెట్టుబడులు రావడం రూపాయికి మద్దతుగా నిలిచాయి. ఉదయం ట్రేడింగ్‌లో రూపాయి 31 పైసలు లాభపడి 93.62 వద్ద కొనసాగింది. మార్కెట్ ప్రారంభంలో రూపాయి 93.72 వద్ద ట్రేడింగ్ మొదలుపెట్టి కొద్దిసేపటికే మరింత పుంజుకుంది. సోమవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి రూపాయి 25 పైసలు బలపడి 93.94 వద్ద స్థిరపడింది. ముడి చమురు ధరలు తగ్గడంతో ద్రవ్యోల్బణంపై ఆందోళనలు కొంత తగ్గాయని కరెన్సీ నిపుణులు తెలిపారు. దేశీయ మార్కెట్లలో సానుకూల పరిస్థితులు కూడా రూపాయికి అనుకూలంగా మారాయని పేర్కొన్నారు. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు వరుసగా ఐదో రోజు నికర కొనుగోలుదారులుగా నిలిచారు. సోమవారం ఒక్కరోజే రూ.4,864 కోట్ల విలువైన ఈక్విటీలను కొనుగోలు చేశారు. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లో డాలర్ బలపడటం రూపాయి లాభాలను కొంత పరిమితం చేసింది. డాలర్ ఇండెక్స్ 0.04 శాతం పెరిగి 103.50 వద్ద కొనసాగింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను పెంచవచ్చనే అంచనాలు డాలర్‌కు మద్దతుగా నిలిచాయి. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ఫ్యూచర్స్ ధర 0.75 శాతం తగ్గి బ్యారెల్‌కు 91.75 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. పశ్చిమాసియా నుంచి చమురు సరఫరా మెరుగుపడటం ధరల తగ్గుదలకు కారణంగా విశ్లేషకులు పేర్కొన్నారు.

తెలంగాణపై సోనియాకు ప్రేమ లేదు

తెలంగాణ రాష్ట్రం సోనియాగాంధీ దయాభిక్ష కాదని.. కేసీఆర్ నాయకత్వంలో ప్రజలు సాగించిన మహోన్నత పోరాట ఫలితమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. సోనియాగాంధీ ఆత్మకథలో తెలంగాణ ప్రస్తావన ఎందుకు లేదని ప్రశ్నించారు. ఆమె గుండెల్లో తెలంగాణ ఉందని చెప్పుకునే కాంగ్రెస్ నేతలు దీనికి సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ ఉద్యమ ఉప్పెనకు భయపడే కాంగ్రెస్ రాష్ట్ర ఏర్పాటుకు అంగీకరించిందని చెప్పారు. ఇప్పుడు ఆ ఘనతను తమ పార్టీ ఖాతాలో వేసుకోవాలని కాంగ్రెస్ చూస్తోందని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం మీడియాతో జరిగిన చిట్‌చాట్‌లో అనేక సమకాలీన రాజకీయ అంశాలపై కేటీఆర్ మాట్లాడారు.

టాటా గ్రూప్‌లో అన్నదమ్ముల పోరు

నోయెల్ టాటాపై జిమ్మీ టాటా ఆరోపణలు.. లిస్టింగ్‌పై విభేదాలు

ముంబై, నవంబర్ 17 : దేశీయ పారిశ్రామిక దిగ్గజం టాటా గ్రూప్‌లో నాయకత్వ విభేదాలు మరోసారి బయటపడ్డాయి. దివంగత రతన్ టాటా సోదరుడు, సర్ రతన్ టాటా ట్రస్ట్ శాశ్వత ట్రస్టీ జిమ్మీ టాటా (85).. తన సవతి సోదరుడు, టాటా ట్రస్ట్స్ అధిపతి నోయెల్ టాటాపై తీవ్ర ఆరోపణలు చేశారు. టాటా సన్స్‌ను కుటుంబ నియంత్రణలోకి తీసుకురావడానికి నోయెల్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సహ ట్రస్టీ విజయ్ సింగ్‌తో ఈ నెలలో జరిపిన లిఖితపూర్వక సంభాషణలో జిమ్మీ ఈ అంశాలను ప్రస్తావించినట్లు కథనాలు వెల్లడించాయి. టాటా సన్స్‌లో టాటా ట్రస్టులకు దాదాపు 66 శాతం వాటా ఉంది. ఈ ట్రస్టుల పరిధిలోని కీలక విభాగాల్లోకి నోయెల్ తన పిల్లలు లియా, మాయ, నెవిల్‌లను తీసుకురావడాన్ని జిమ్మీ తప్పుబట్టారు. టాటా గ్రూప్ వ్యవస్థాపకులు ప్రజా ప్రయోజనాలు, సామాజిక సేవ లక్ష్యంగా ధార్మిక ట్రస్టులను



ఏర్పాటు చేశారని, ఒకే కుటుంబం ఆధిపత్యం కోసం కాదని జిమ్మీ పేర్కొన్నారు. కుటుంబ సభ్యులను ట్రస్టుల్లోకి తీసుకురావడం వల్ల వాటిని వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించుకునే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్‌కు మూడోసారి ఐదేళ్ల పదవీకాల పొడిగింపును నోయెల్ వ్యతిరేకించడాన్ని కూడా జిమ్మీ తప్పుబట్టారు. సెప్టెంబర్‌లో జరిగిన బోర్డు సమావేశంలో చంద్రశేఖరన్ కొనసాగింపునకు అనుకూలంగా 4-1 మెజారిటీతో తీర్మానం ఆమోదం పొందినప్పటికీ, నిబంధనల ఉల్లంఘన జరిగిందంటూ నోయెల్ అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు కథనాలు పేర్కొన్నాయి. టాటా సన్స్‌ను స్టాక్ మార్కెట్లో లిస్ట్ చేయాలని జిమ్మీ సమర్థిస్తున్నారు. పారదర్శకత, జవాబుదారీతనం కోసం లిస్టింగ్ అవసరమని పేర్కొన్నారు. ఆర్‌బీఐ నిబంధనల నుంచి తప్పించుకునేందుకు యాజమాన్యం చేసే ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరారు. ఈ వివాదంలో ఆర్‌బీఐ, కేంద్ర ప్రభుత్వం, మహారాష్ట్ర ఛారిటీ కమిషనర్ జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే జిమ్మీ ఆరోపణలను నోయెల్ వర్గం తిరస్కరించింది. వాటికి చట్టబద్ధత లేదని పేర్కొంది. టాటా సన్స్ పబ్లిక్ లిస్టింగ్ వల్ల స్వల్పకాలిక లాభాల కోసం ఒత్తిడి పెరిగి గ్రూప్ సేవా దృక్పథం దెబ్బతింటుందనేది నోయెల్ వాదనగా ఉంది. ట్రస్టీలైన వేణు శ్రీనివాసన్, విజయ్ సింగ్ చంద్రశేఖరన్ కొనసాగింపునకు మద్దతు తెలిపారు. ఈ నేపథ్యంలో నవంబర్ 20 నాటికి జరగనున్న కీలక బోర్డు సమావేశంపై ఆసక్తి నెలకొంది.

భారత్‌లో అమెజాన్ 58 వేల కోట్ల పెట్టుబడులు

గ్రీన్ ఎనర్జీపై దృష్టి.. నాలుగు కొత్త ప్రాజెక్టుల ప్రకటన

న్యూఢిల్లీ, నవంబర్ 17 : భారత్‌లో పునరుత్పాదక ఇంధన రంగాన్ని విస్తరించేందుకు ప్రముఖ ఈ-కామర్స్, క్లౌడ్ సేవల సంస్థ అమెజాన్ భారీ పెట్టుబడుల ప్రణాళికను ప్రకటించింది. 2030 నాటికి అదనంగా 7 బిలియన్ డాలర్లు, అంటే రూ.58 వేల కోట్లకు పైగా గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల్లో పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడించింది. ఇప్పటికే పునరుత్పాదక ఇంధన ఒప్పందాల కోసం 4 బిలియన్ డాలర్లను కేటాయించిన సంస్థ తాజా నిర్ణయంతో విస్తరణను వేగవంతం చేయనుంది. ఇప్పటికే కేటాయించిన నిధుల్లో భాగంగా మొత్తం 934 మెగావాట్ల సామర్థ్యంతో నాలుగు విండ్, సోలార్ ప్రాజెక్టులను అమెజాన్ ప్రకటించింది. కర్ణాటకలో 234 మెగావాట్ల విండ్ ప్రాజెక్టు, 200 మెగావాట్ల విండ్-సోలార్ హైబ్రిడ్ ప్రాజెక్టు ఏర్పాటు చేయనుంది. మధ్యప్రదేశ్‌లో 300 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టు, రాజస్థాన్‌లో 200 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టును అభివృద్ధి చేయనుంది. కర్ణాటకలోని 234 మెగావాట్ల విండ్ ప్రాజెక్టు ఆసియాలో అమెజాన్ చేపట్టిన అతిపెద్ద పవన విద్యుత్ ఒప్పందంగా సంస్థ పేర్కొంది. ఈ నాలుగు ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే భారత్‌లో అమెజాన్ ఒప్పందం చేసుకున్న పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యం 2 గిగావాట్లకు పైగా చేరుకుంటుంది. ఈ విద్యుత్ దాదాపు 35 లక్షల భారతీయ గృహాల వార్షిక విద్యుత్ అవసరాలకు సమానమని తెలిపింది. ప్రస్తుతం భారత్‌లో అమెజాన్‌కు సంబంధించి 14 భారీ విండ్, సోలార్ ప్రాజెక్టులు, 43 ఆన్‌సైట్ సోలార్ యూనిట్లు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా 40 గిగావాట్లకు పైగా సామర్థ్యంతో దాదాపు 700 ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని సంస్థ వెల్లడించింది. 2030 నాటికి తమ కార్యకలాపాలకు వినియోగించే విద్యుత్ ద్వారా



వెలువడే కర్బన ఉద్గారాల తీవ్రతను 2019 స్థాయితో పోలిస్తే 65 శాతం తగ్గించాలని అమెజాన్ లక్ష్యంగా పెట్టుకుంది. 2040 నాటికి నెట్ జీరో కర్బన ఉద్గారాల స్థాయికి చేరుకోవాలని భావిస్తోంది. అమెజాన్ పెట్టుబడుల నిర్ణయాన్ని కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి స్వాగతించారు. అంతర్జాతీయ సంస్థలకు భారత హరిత ఇంధన రంగంపై ఉన్న నమ్మకానికి ఈ పెట్టుబడులు నిదర్శనమని పేర్కొన్నారు. విద్యుత్ గ్రిడ్ ఆధునీకరణ, ఉపాధి అవకాశాల పెంపు, ఇంధన భద్రతకు ఈ ప్రాజెక్టులు దోహదపడతాయని తెలిపారు.

తిరుపతి తరహాలో శబరిమల అభివృద్ధి

మెగా ప్రాజెక్టుకు కేరళ ప్రభుత్వం ప్రణాళిక కొచ్చి ఎయిర్‌పోర్టులో భక్తుల సేవా కేంద్రం

తిరువనంతపురం, నవంబర్ 17 : శబరిమలలో తిరుమల-తిరుపతి తరహాలో భారీ మౌలిక వసతుల ప్రాజెక్టును చేపట్టేందుకు కేరళ ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది. అయ్యప్ప భక్తులకు ఆధునిక సదుపాయాలు కల్పించడంతో పాటు ఆధ్యాత్మిక పర్యాటకాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి వి.డి.సతీశన్ ప్రకటించినట్లు కథనం పేర్కొంది. కొచ్చిన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన శబరిమల యాత్రికుల సేవా కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. శబరిమలకు వచ్చే భక్తులు దర్శనం తర్వాత రాష్ట్రంలోని ఇతర ప్రముఖ ఆలయాలను కూడా సందర్శించేలా ప్రత్యేక నెట్‌వర్క్‌ను రూపొందిస్తున్నట్లు తెలిపారు.



ఈ ప్రణాళికతో శబరిమలకు వచ్చే భక్తుల సంఖ్య మరో 50 శాతం పెరిగే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. శబరిమలలో దీర్ఘకాలిక మౌలిక వసతుల అభివృద్ధిపై మండల పూజా సీజన్ ముగిసిన తర్వాత ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఇప్పటికే పంబ, సన్నిధానంలో ఏర్పాట్లను సమీక్షించినట్లు తెలిపారు. కొచ్చి విమానాశ్రయంలోని డొమెస్టిక్ అరైవల్ టెర్మినల్ సమీపంలో 5 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో యాత్రికుల సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ శబరిమలకు వెళ్లే కేరళ ఆర్టీసీ బస్సుల కోసం ప్రత్యేక బుకింగ్ కౌంటర్ అందుబాటులోకి వచ్చింది. బస్సు సర్వీసులను కూడా ప్రారంభించారు. డిమాండ్‌కు అనుగుణంగా చార్టర్డ్ బస్సులు, హెలికాప్టర్ బుకింగ్ కౌంటర్, ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు హెల్ప్ డెస్క్, ప్రసాదం కూపన్ కౌంటర్లను ఏర్పాటు చేశారు. ప్రీపెయిడ్ ట్యాక్సీలు, శాకాహార భోజనశాల, ఏసీ విశ్రాంతి గదులు, ఉచిత వైఫై, విమానాల రాకపోకల సమాచారం తెలిపే డిస్‌ప్లే వ్యవస్థను కూడా అందుబాటులో ఉంచారు.

వ్యవసాయ రంగంలో 1,393 ఉద్యోగాలు

ఏఎస్ఆర్‌బీ నోటిఫికేషన్ విడుదల.. నేటి నుంచి దరఖాస్తులు

న్యూఢిల్లీ, నవంబర్ 17 : వ్యవసాయ రంగంలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు అగ్రికల్చరల్ సైంటిస్ట్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఏఎస్ఆర్‌బీ) అవకాశం కల్పించింది. భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) పరిధిలో మొత్తం 1,393 టెక్నికల్ అసిస్టెంట్, సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. మొత్తం పోస్టుల్లో టెక్నికల్ అసిస్టెంట్ (టీ-3) ఖాళీలు 1,254 ఉండగా, సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ (టీ-4) పోస్టులు 139 ఉన్నాయి. టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులకు పే లెవల్-5 ప్రకారం నెలకు రూ.29,200 నుంచి రూ.92,300 వరకు, సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులకు పే లెవల్-6 ప్రకారం రూ.35,400 నుంచి రూ.1,12,400 వరకు వేతనం ఉంటుంది. పోస్టును బట్టి అగ్రికల్చర్, హార్టికల్చర్, బయోటెక్నాలజీ విభాగాల్లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. యానిమల్ సైన్స్, ఫిషరీస్ పోస్టులకు బీవీఎస్సీ అండ్ ఏహెచ్ లేదా బీఎఫ్ఎస్సీ అర్హత అవసరం. ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధిత బ్రాంచ్‌లో బీటెక్, బీఈ లేదా మూడేళ్ల డిప్లొమా ఉండాలి. లైబ్రరీ సైన్స్ పోస్టులకు సంబంధిత డిగ్రీ, ఐటీ విభాగాలకు బీసీఏ, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ లేదా సంబంధిత ఇంజనీరింగ్ డిగ్రీ ఉండాలి. అభ్యర్థుల వయస్సు 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం



వయోసడలింపు వర్తిస్తుంది. ప్రిలిమినరీ, మెయిన్స్ కంప్యూటర్ ఆధారిత పరీక్షల ద్వారా ఎంపిక చేస్తారు. ఆన్‌లైన్ దరఖాస్తులు నవంబర్ 18 నుంచి ప్రారంభమై డిసెంబర్ 17 రాత్రి 11.59 గంటల వరకు కొనసాగుతాయి. దరఖాస్తు ఫీజు రూ.300గా నిర్ణయించారు.

స్టాక్ మార్కెట్లలో బుల్ రన్

ముంబై, నవంబర్ 17 : దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం లాభాలతో ముగిశాయి. బ్యాంకింగ్ రంగ షేర్లలో కొనుగోళ్లు పెరగడం, విదేశీ పెట్టుబడులు రావడంతో ప్రధాన సూచీలు పుంజుకున్నాయి. సెన్సెక్స్ 427 పాయింట్లు పెరిగి 82,532 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 96 పాయింట్ల లాభంతో 25,387 వద్ద ముగిసింది. దీంతో నిఫ్టీ తొమ్మిది నెలల గరిష్ఠ స్థాయికి చేరింది. బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లతో నిఫ్టీ బ్యాంక్ సూచీ 62,422 పాయింట్లకు చేరుకుని జీవితకాల గరిష్ఠ స్థాయిని నమోదు చేసింది. రుణాల వృద్ధి, డిపాజిట్ల ప్రవాహం, నిర్వహణ ఖర్చులు అదుపులో ఉండటం బ్యాంకింగ్ రంగానికి మద్దతుగా నిలిచాయని మార్కెట్ నిపుణులు తెలిపారు. నిఫ్టీకి 25,500 పాయింట్ల వద్ద కీలక రెసిస్టెన్స్ ఉందని విశ్లేషకులు పేర్కొన్నారు. ఈ స్థాయిని దాటితే 25,800 నుంచి 26,000 పాయింట్ల వరకు పెరిగే అవకాశం ఉందని అంచనా వేశారు. మార్కెట్‌లో దిద్దుబాటు వస్తే 25,300 పాయింట్ల తక్షణ మద్దతుగా ఉండొచ్చని తెలిపారు. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల కొనుగోళ్లు మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచాయి. నవంబర్‌లో ఇప్పటివరకు 9.5 బిలియన్ డాలర్లకు పైగా విలువైన ఈక్విటీలను కొనుగోలు చేసినట్లు కథనం పేర్కొంది. నిఫ్టీ కంపెనీల్లో అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఐషర్ మోటార్స్, మ్యాక్స్ హెల్త్‌కేర్ షేర్లు లాభాల్లో ముందంజలో నిలిచాయి. రియల్టీ, పీఎస్‌యూ బ్యాంక్ షేర్లు రాణించగా, ఐటీ, ఎఫ్ఎంసీజీ, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ షేర్లు లాభాల స్వీకరణతో నష్టాల్లో ముగిశాయి.

60 వేల మంది ఉద్యోగులకు మైక్రోసాఫ్ట్ ఎగ్జిట్ ఆఫర్

కెరీర్‌లో మార్పు కోరుకునే వారికి అవకాశమన్న సత్య నాదెళ్ల

న్యూఢిల్లీ, నవంబర్ 17 : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉద్యోగులకు స్వచ్ఛంద నిష్క్రమణ ప్యాకేజీలను అందిస్తున్నట్లు మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల తెలిపారు. తమ కెరీర్‌లో కొత్త అవకాశాలను వెతుక్కోవాలనుకునే ఉద్యోగులకు ఆర్థికంగా అండగా నిలవడమే ఈ నిర్ణయం ఉద్దేశమని పేర్కొన్నారు. ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన ఆయన.. ఏఐ విస్తరణతో ఉద్యోగాల స్వభావం, పని విధానాల్లో పెద్ద మార్పులు వస్తున్నాయని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ ఉద్యోగుల్లో సుమారు 27 శాతం మందికి, అంటే దాదాపు 60 వేల మందికి వాలంటరీ ఎగ్జిట్ ఆప్షన్ అందుబాటులోకి తెచ్చినట్లు కథనాలు పేర్కొన్నాయి. భారత్, అమెరికా, కెనడా, బ్రిటన్ దేశాల్లోని ఉద్యోగులకు ఈ ప్యాకేజీలు అందించినట్లు తెలిపాయి. భవిష్యత్తులో కొత్త ఉద్యోగాలు వచ్చినప్పటికీ వాటికి అవసరమైన నైపుణ్యాలు భిన్నంగా ఉంటాయని సత్య నాదెళ్ల వివరించారు. సంస్థలో ఉన్నా, బయటకు వెళ్లినా ఉద్యోగులు కొత్త నైపుణ్యాలను నేర్చుకుని ఎదగాలని సూచించారు. ఒకే రోల్‌లో కొనసాగుతూ కెరీర్‌లో ఎదుగుదల లేదని భావించే ఉద్యోగులు స్వతంత్రంగా నిర్ణయం తీసుకునేందుకు ఈ అవకాశం ఉపయోగపడుతుందని చెప్పారు. సంస్థ వెలుపల కొత్త అవకాశాలు వెతుక్కోవాలనుకునే వారికి ఎగ్జిట్ ప్యాకేజీలు ఆర్థిక వెసులుబాటు కల్పిస్తాయని తెలిపారు. సాధారణ ఉద్యోగిగా కెరీర్ ప్రారంభించి సీఈఓ స్థాయికి చేరుకున్న తన అనుభవాన్ని గుర్తుచేసుకున్నారు. ఎదుగుదల లేకుండా ఒకే పాత్రలో కొనసాగడాన్ని తాను వ్యక్తిగతంగా ఇష్టపడనని పేర్కొన్నారు. సంస్థలోనే కొనసాగేవారికి కూడా భవిష్యత్తులో కొత్త అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు.

దిగొచ్చిన బంగారం, వెండి ధరలు

తులం పసిడిపై రూ.770 తగ్గింపు

కిలో వెండిపై రూ.1,080 తగ్గుదల

ముంబై, నవంబర్ 17 : దేశీయ బులియన్ మార్కెట్లో మంగళవారం బంగారం, వెండి ధరలు తగ్గాయి. అన్ని ప్రధాన స్వచ్ఛత గ్రేడ్లలో పసిడి ధరలు దిగొచ్చాయి. ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ (ఐబీజేఏ) విడుదల చేసిన ముగింపు గణాంకాల ప్రకారం 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.770 తగ్గగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.705 తగ్గింది. 999 స్వచ్ఛత కలిగిన 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.1,34,201 వద్ద నమోదైంది. సోమవారం ఈ ధర రూ.1,34,971గా ఉంది. 916 స్వచ్ఛత కలిగిన 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,23,633 నుంచి రూ.1,22,928కి తగ్గింది. రెండు విభాగాల్లోనూ ధరలు సుమారు 0.57 శాతం క్షీణించాయి. 995 స్వచ్ఛత కలిగిన బంగారం 10 గ్రాములకు రూ.1,33,664, 18 క్యారెట్ల బంగారం రూ.1,00,651, 14 క్యారెట్ల బంగారం రూ.78,508 వద్ద ముగిశాయి. ఇవి దేశవ్యాప్త బులియన్ మార్కెట్ సూచీ ధరలని, వీటికి జీఎస్టీ, నగల తయారీ ఛార్జీలు అదనమని అసోసియేషన్ తెలిపింది. వెండి ధర కూడా తగ్గింది. 999 స్వచ్ఛత కలిగిన కిలో వెండి ధర రూ.1,70,251 నుంచి రూ.1,69,171కి పడిపోయింది. కిలోపై రూ.1,080 తగ్గుదల నమోదైంది. ప్రముఖ నగల షోరూమ్‌లు కూడా రిటైల్ ధరలను సవరించాయి. తనిష్క్‌లో 22 క్యారెట్ల బంగారం గ్రాము ధర రూ.12,520గా ఉండగా, కల్యాణ్ జ్యువెలర్స్‌లో రూ.12,470గా నమోదైంది. హైదరాబాద్‌లోని మలబార్ గోల్డ్, జోయాలుక్కాస్, జీఆర్టీ షోరూమ్‌లలోనూ 22 క్యారెట్ల బంగారం గ్రాము ధర రూ.12,470గా ఉంది.

టాటా సన్స్ లిస్టింగ్ తప్పనిసరి

ఎన్‌బీఎఫ్‌సీ నిబంధనలు పాటించాల్సిందేనన్న ఆర్‌బీఐ

ముంబై, నవంబర్ 17 : టాటా గ్రూప్ ప్రధాన హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్‌కు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక ఆదేశాలు జారీ చేసినట్లు నివేదికలు వెల్లడించాయి. అప్పర్ లేయర్ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలకు (ఎన్‌బీఎఫ్‌సీ) వర్తించే అన్ని నిబంధనలను పాటించాల్సిందేనని స్పష్టం చేసినట్లు పేర్కొన్నాయి. ఇందులో స్టాక్ మార్కెట్లో లిస్టింగ్ నిబంధన కూడా ఉన్నట్లు తెలిపాయి. రెగ్యులేటరీ మార్గదర్శకాలపై గత నెలలో టాటా సన్స్ రాసిన లేఖకు ఆర్‌బీఐ స్పందించినట్లు సమాచారం. ఈ మేరకు సంస్థ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌కు లేఖ పంపినట్లు నివేదికలు పేర్కొన్నాయి. అప్పర్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీలకు వర్తించే ప్రస్తుత నిబంధనలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా అనుసరించాలని సూచించినట్లు తెలిపాయి. గత సెప్టెంబర్‌లో కోర్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ (సీఐసీ) రిజిస్ట్రేషన్‌ను స్వచ్ఛందంగా రద్దు చేసుకోవాలంటూ టాటా సన్స్ చేసిన విజ్ఞప్తిని ఆర్‌బీఐ తిరస్కరించినట్లు కథనాలు పేర్కొన్నాయి. రుణాలన్నీ తీర్చివేసిన



సాయిపల్లవి ఖాతాలో తొలి రూ.వెయ్యి కోట్ల సినిమా!



